ఆదివారం
SUNDAY
1-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 123

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక



‘హస్తం’ వ్యస్తం!

ఉత్తర తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు!

మంత్రుల మధ్య లేని సయోధ్య

వ్యక్తిగత ప్రాబల్యానికే ప్రాధాన్యం

ఎదుగుదలను తట్టుకోలేని తనం

పార్టీ కార్యకర్తల్లో తీవ్ర అసహనం



“రాజకీయాల్లో ప్రత్యర్థి విసిరే సవాలును ఎదుర్కోవడం ఒక ఎత్తయితే.. సొంత గూటిలోనే పొంచి ఉన్న రాజకీయ ముప్పును పసిగట్టడం మరో ఎత్తు. బయట నుంచి వచ్చే దాడికి సమాధానం చెప్పవచ్చు. కానీ లోపల నుంచే మొదలయ్యే రాజకీయ వ్యూహాలను అంచనా వేయడం అంత సులభం కాదు. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి అంతర్గత విభేదాలు పెనుసవాలుగా మారుతాయి. ఎందుకంటే ప్రతిపక్షం చేసే విమర్శలకంటే.. సొంత పార్టీలోనే కొనసాగే ఆధిపత్య పోరు పార్టీ పునాదులను బలహీనపరిచే ప్రమాదం ఉంది.

తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం వినిపిస్తున్న రాజకీయ చర్చలు ఈ అంశాన్నే మరోసారి తెరపైకి తెస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన తరుణంలో.. నాయకుల మధ్య రాజకీయ ఆధిపత్య పోరు నడుస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల్లో పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన సమయంలో.. ఎవరి ప్రాబల్యం పెరగాలి? ఎవరి రాజకీయ పరిధి విస్తరించాలి? ఎవరి ఎదుగుదలకు కళ్లెం వేయాలి? అన్న లెక్కలు తెరవెనుక నడుస్తున్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.”

ఈవార్తలు పొలిటికల్ స్టోరీ

ప్రజాక్షేత్రంలో పట్టు సాధించే నాయకత్వం ఏ పార్టీకైనా బలం. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ వంటి సామాజిక, రాజకీయ ప్రాధాన్యం కలిగిన ప్రాంతంలో బీసీలు, దళితులు, గిరిజనులు, కార్మికులు, పేదలతో బలమైన అనుబంధం కలిగిన నాయకత్వం కాంగ్రెస్‌కు అవసరం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, వారి సమస్యలపై నిరంతరం స్పందించే నాయకులు పార్టీకి వెన్నెముకగా నిలుస్తారు. ఈ నేపథ్యంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఉత్తర తెలంగాణలో తన రాజకీయ ప్రాధాన్యాన్ని విస్తరించుకుంటున్న తీరు కొందరి రాజకీయ తరువాయి 2 వ పేజీలో...



నేటి నుంచి అయోధ్య కొత్త దర్శన వేళలు

అయోధ్య: అయోధ్య రామమందిరంలో బాలరాముడి నిత్య పూజలు, హారతులు, నైవేద్యాలు, విశ్రాంతి, భక్తుల దర్శన వేళల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కొత్త షెడ్యూల్‌ను రూపొందించింది. ఈ సవరించిన సమయాలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం తెల్ల వారుజామున 3.45 గంటలకు తెరుచుకుంటున్న ఆలయ ద్వారాలు.. కొత్త షెడ్యూల్ ప్రకారం ఉదయం 4 గంటలకు తెరుచుకోనున్నాయి. -2 వ పేజీలో...



ఐటీ కారిడార్‌లో ‘కౌంటర్ ఫ్లో’

ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా నిర్ణయం
దేశంలోనే తొలి ప్రయోగం

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో నిత్యం తలనొప్పిగా మారిన ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు వినూత్న పరిష్కారంతో ముందుకొస్తున్నారు. రద్దీ వేళల్లో వాహనదారుల కష్టాలను తీర్చేందుకు “కౌంటర్ ఫ్లో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్” (సీబీఆర్‌టీ) -2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,888
వెండి (కిలో):	రూ.2,00,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,361

విశ్వవాణి



ప్రపంచ సముద్రాల ఉపరితల సగటు ఉష్ణోగ్రతలు గతంలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయి. ధ్రువ ప్రాంతాలను మినహాయించిన సముద్ర జలాల ఉష్ణోగ్రత 21.1 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లు యూరప్‌కు చెందిన కోపర్నికస్ వాతావరణ సేవ గణాంకాలు వెల్లడించాయి. 2024 మార్చిలో నమోదైన 21.09 డిగ్రీల మునుపటి రికార్డును ఇది అధిగమించింది. సాధారణంగా దక్షిణ అర్ధగోళంలో వేసవి ముగిసే మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో సముద్రాల ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుతాయి. ఈసారి ఆగస్టులోనే కొత్త రికార్డు నమోదవడం అసాధారణ పరిణామం.

ఇండియానా.. ఎన్డీయేనా?

ఒకే రోజు ఇండియా కూటమి, బీజేపీ మెగా మార్చ్‌లు

రాంలీలాలో చలో ఢిల్లీ.. రోహతక్‌లో లోక్‌తంత్ర బచావో

రాహుల్ పాదయాత్ర.. అనుమతి లేదన్న ఢిల్లీ పోలీసులు



దేశ రాజధాని ప్రాంతం వేదికగా కేంద్ర అధికార, ప్రతిపక్ష కూటముల మధ్య ముఖాముఖి వీధిపోరుకు రంగం సిద్ధమైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ శనివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ‘ప్రజా అభిశంసన’ నిర్వహించిన ఇండియా కూటమి.. నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది.

న్యూఢిల్లీ: దీనికి దీటుగా అదే రోజున హర్యానాలోని రోహతక్‌లో బీజేపీ కూడా ‘లోక్‌తంత్ర బచావో, అరాజక్ హటావో’ పేరిట భారీ కౌంటర్ మార్చ్‌ను ప్రకటించడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయంటూ ఇండియా కూటమి శనివారం ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో లాంఛనప్రాయంగా సీఈసీపై ఇంపీచ్‌మెంట్ విచారణ చేపట్టింది. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఖర్గే, తేజస్వి యాదవ్ తదితర నేతలు మాట్లాడుతూ.. ఏకంగా 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తరువాయి 2 వ పేజీలో...

డ్రగ్స్ పార్టీలో 108 మంది విద్యార్థి

చేవెళ్ల ఫాంహౌస్‌లో గుట్టుగా పార్టీ

విద్యార్థులందరికీ డ్రగ్స్ టెస్టులు

ముగ్గురికి పాజిటివ్‌గా నిర్ధారణ

హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో విద్యార్థుల పార్టీ తీవ్ర కలకలం రేపింది. కమ్మెట గ్రామ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పార్టీపై స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేశారు. ఈ పార్టీలో సుమారు 108 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. వారందరికీ డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. అందులో ముగ్గురికి గంజాయి పాజిటివ్‌గా వచ్చినట్లు వెల్లడించారు.



చేవెళ్ల, అక్టోబర్ 31 (ఈవార్తలు): పార్టీ నిర్వహించిన ప్రధాన నిర్వాహకుడు మన్నన్‌తో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల మధ్య మత్తు పదార్థాల వినియోగంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మెట గ్రామ శివారులో ఉన్న ఎల్జీ ఫామ్ హౌస్‌లో శుక్రవారం రోజున ఈ పార్టీ నిర్వహించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రధాన నిర్వాహకుడు మన్నన్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా ఫ్రెండ్స్, ఫాలోవర్లకు ఈ డ్రగ్స్ పార్టీ గురించి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ జరిగే ప్రదేశం వివరాలను ముందుగానే వెల్లడించకుండా రహస్యంగా ఉంచినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇక ఈ పార్టీకి హాజరయ్యే వారి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.1,000 నుంచి 2,000 వరకు తరువాయి 2 వ పేజీలో...



రంపంతో విద్యార్థినిని కోసేశాడు!

ప్రభుత్వ పాఠశాలలో దారుణం.. ఏపీలోని అనంతపురం జిల్లాలో ఘటన

ఏపీలోని అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ వ్యక్తి చెట్లను కోసే ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో చాలా తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలోకి వచ్చిన నిందితుడు విద్యార్థినిపై ఒక్కసారిగా దాడికి పాల్పడినట్లు సమాచారం.

రాప్తాడు, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఆమెపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ ఘటనతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన తరువాయి 2 వ పేజీలో...

కబడ్డీలో భారత్ డబుల్ ధమాకా!

కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళలకు టైటిళ్లు

మహిళల ఫైనల్లో ఉగాండాపై 35-15తో ఘన విజయం

పురుషుల తుదిపోరులో శ్రీలంకపై 54-20తో జయభేరి

ఒక్క ఓటమి లేకుండా అజేయంగా నిలిచిన భారత జట్లు

అహ్మదాబాద్: భారత కబడ్డీ జట్లు అంతర్జాతీయ వేదికపై సత్తాచాటాయి. తొలిసారిగా నిర్వహించిన కామన్వెల్త్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో విజేతలుగా నిలిచి భారత్‌కు ద్వంద్వ విజయాన్ని అందించాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్లు.. ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి ఎరుగకుండా టైటిళ్లను కైవసం చేసుకోవడం విశేషం. శనివారం -2 వ పేజీలో...

రాశి ఫలాలు

1.11.2026

మేషం: వ్యాపార ఉన్నతికి చేసిన శ్రమ ఫలిస్తుంది. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. వృత్తి ఉద్యోగములలో సమస్యలను తెలివితేటలతో అధిగమిస్తారు. కొన్ని వ్యవహారాలలో ఆత్మీయులు సలహాలు తీసుకొని ముందుకు సాగడం మంచిది. అవసరానికి ధన సహాయం అందుతుంది.

వృషభం: మానసికంగా ప్రశాంతత లభిస్తుంది. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఉద్యోగమున మీ విలువ పెరుగుతుంది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చాలా రోజులుగా ఉన్న సమస్యలు తొలగుతాయి.

మిథునం: వృధాప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయట నూతన సమస్యలు ఉత్పన్నమౌతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఋణ భారం అధికమౌతుంది. వృత్తి వ్యాపారాలలో నిలకడ లోపిస్తుంది. ఉద్యోగమున అదనపు బాధ్యతలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలలో స్థిరత్వం లేని ఆలోచనల వలన నష్టాలు వస్తాయి. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

సింహం: సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు వింటారు. ఉద్యోగమున ఆశించిన పురోగతి సాధిస్తారు. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. ఆర్థిక విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వ్యాపారాలకు మిత్రుల నుండి పెట్టుబడులకు ధన సహాయం అందుతుంది.

కన్య: ధన వ్యవహారాలు కలసివస్తాయి. మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి. నూతన వాహనం కొనుగోలుకు ఆటంకాలు తొలగుతాయి.

తుల: కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృశ్చికం: వ్యాపారమున భాగస్థులతో వివాదాలు తొలగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు వలన సకాలంలో పనులు పూర్తి కావు. వృత్తి ఉద్యోగాలలో చిన్నపాటి సమస్యలు ఉంటాయి. బంధువుల నుండి ఊహించని ఒత్తిడి కలుగుతుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలలో శ్రద్ధ వహించాలి.

ధనస్సు: ఉద్యోగమున వివాదాలు పరిష్కారమౌతాయి. కుటుంబ సభ్యుల సహాయంతో చాలాకాలంగా పూర్తికానీ పనులు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో సమస్యలను అధిగమిస్తారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తుంది.

మకరం: ఉద్యోగమున స్థానచలన సూచనలు ఉన్నవి. జీవిత భాగస్వామితో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో కష్టానికి తగిన ఫలితం లభించదు. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తికాక చికాకులు పెరుగుతాయి.

కుంభం: ఆత్మీయులతో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తికావు. నిరుద్యోగ ప్రయత్నాలు కలసిరావు. బంధువర్గం నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. కొన్ని వ్యవహారాలలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

‘హస్తం’ వ్యస్తం!

మొదటి పేజీ తరువాయి

సమీకరణాలకు అసౌకర్యంగా మారుతోందా? కార్మిక సంక్షేమం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆయన చురుగ్గా వ్యవహరిస్తున్న సమయంలో.. ఆయన రాజకీయ ఎదుగుదలపై అనుమానాలు సృష్టించే ప్రచారాలు ఎందుకు తెరపైకి వస్తున్నాయి? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకరు ఎదిగితే మరొకరు తగ్గిపోతారనే ఆలోచన రాజకీయాలకు శాపం. వ్యక్తిగత ప్రాబల్యం కంటే పార్టీ ప్రయోజనమే ప్రధానమనే సూత్రాన్ని విస్మరిస్తే.. చివరకు సంస్థాగత బలం క్షీణించడం ఖాయం. ఉత్తర తెలంగాణ రాజకీయాలను పరిశీలిస్తే ప్రతి ప్రాంతానికీ ప్రత్యేకమైన రాజకీయ నేపథ్యం ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ నాయకులకంటూ ప్రత్యేక అనుచరగణం, సామాజిక పునాది, రాజకీయ ప్రాబల్యం ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒక నాయకుడి ఎదుగుదల మరో నాయకుడి ప్రభావంపై చర్చకు దారితీయడం సహజం. అయితే ఆ పోటీ ప్రజాసేవలో ఉండాలే తప్ప.. ఒకరిని మరొకరు బలహీనపరిచే రాజకీయ వ్యూహాలుగా మారకూడదు. ప్రస్తుతం మంత్రి శ్రీధర్‌బాబు పేరు చుట్టూ కూడా ఇలాంటి రాజకీయ చర్చలు వినిపిస్తున్నాయి. శ్రీధర్‌బాబు తెలంగాణ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. మంథని నియోజకవర్గంలో ఆయనకు సుదీర్ఘ రాజకీయ పునాది ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే కాంగ్రెస్ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం, పార్టీపై ఉన్న పట్టు, ప్రభుత్వంలో నిర్వహిస్తున్న బాధ్యతలు ఎవరికీ కొత్త విషయాలు కావు. అయితే ఆయనకున్న రాజకీయ ప్రాబల్యం ఉత్తర తెలంగాణలో పార్టీ అంతర్గత సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతోంది? ప్రాంతీయంగా మరో నాయకత్వం బలపడుతున్నప్పుడు రాజకీయంగా కొత్త సమీకరణాలు రూపొందుతున్నాయా? అనే ప్రశ్నలు చర్చకు వస్తున్నాయి. 2021-22లో రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీకి చెందిన కొందరు సీనియర్ నాయకులు ఆయన నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఆ చర్చల్లో శ్రీధర్‌బాబు పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి ఎంపిక సమయంలోనూ రేవంత్‌రెడ్డి నాయకత్వంపై కొందరు సీనియర్ నేతలకు అభ్యంతరాలున్నాయనే కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆ సందర్భంలోనూ శ్రీధర్‌బాబు పేరు చర్చల్లో వినిపించింది. అయితే చివరకు కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. ఈ పరిణామాలను పరిశీలిస్తే.. గతంలో కాంగ్రెస్ నాయకత్వం చుట్టూ జరిగిన అంతర్గత చర్చలు, విభేదాలు రాజకీయ విశ్లేషణకు ఆస్కారం కల్పిస్తున్నాయి. అయితే గతంలో వ్యక్తమైన అభిప్రాయాల ఆధారంగా ప్రస్తుత రాజకీయ వైఖరిని నిర్ధారించడం సరికాదు. మరోవైపు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో శ్రీధర్‌బాబు కీలక మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూ, ముఖ్యమంత్రి నాయకత్వానికి మద్దతుగా ఆయన పలు సందర్భాల్లో బహిరంగంగా మాట్లాడారు. ఈ నేపథ్యంలో బయట కనిపిస్తున్న రాజకీయ ఐక్యతకు, అంతర్గత రాజకీయ సమీకరణాలకు మధ్య ఏమైనా వ్యత్యాసం ఉందా? అన్న ప్రశ్న కూడా చర్చల్లో భాగమవుతోంది. రాజకీయాల్లో కనిపించేది అంతా వాస్తవం కాకపోవచ్చు.. వినిపించేది అంతా నిజం కాకపోవచ్చు. కానీ పదేపదే తెరపైకి వచ్చే ప్రశ్నలకు రాజకీయ నాయకత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాత్రం ఉంటుంది.

మీడియా కథనాల వెనుక రాజకీయ ప్రయోజనాలు?

ఒక మంత్రి, ఒక ఎంపీ పార్టీ మారుతున్నారంటూ పత్రికల్లో కథనాలు వెలువడినప్పుడు వాటిని తక్షణమే వాస్తవాలుగా పరిగణించలేం. అదే సమయంలో అలాంటి వార్తలు ఏ సందర్భంలో వెలువడ్డాయి? వాటి వెనుక ఉన్న సమాచారం ఏమిటి? వాటి వల్ల రాజకీయంగా ఎవరికి ప్రయోజనం కలుగుతుంది? అనే ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతాయి. ప్రత్యేకించి ఒకే ప్రాంతానికి చెందిన నాయకుల మధ్య రాజకీయ పోటీ ఉన్నప్పుడు మీడియా కథనాలు రాజకీయ చర్చలను మరింత ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఒక నాయకుడి పార్టీ విధేయతపై అనుమానాలు రేకెత్తించే కథనాలు వెలువడితే.. వాటి ప్రభావం వ్యక్తిగత ప్రతిష్ఠకే పరిమితం కాదు. పార్టీ శ్రేణుల్లోనూ గందరగోళం సృష్టించవచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో వివిధ సందర్భాల్లో అంతర్గత అసంతృప్తి బహిర్గతమైంది. 2024లో జగ్గారెడ్డి, జీవన్‌రెడ్డి వంటి సీనియర్ నేతల అంశాలు పార్టీ నిర్ణయాల విధానం, ఇతర పార్టీల నుంచి నాయకుల చేరికలు, సీనియర్లకు ఇస్తున్న ప్రాధాన్యం వంటి అంశాలపై చర్చకు దారితీశాయి. కొందరు నేతలు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అంటే పార్టీలో అంతర్గత భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. అయితే ఆ భిన్నాభిప్రాయాలను పరిష్కరించి పార్టీని ఏకతాటిపైకి తీసుకురావడమే నాయకత్వం ముందున్న కర్తవ్యం. వాటిని మరింత పెంచి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలనే ధోరణి ఉంటే మాత్రం సంస్థాగతంగా పార్టీకి నష్టం తప్పదు. ఇల్లు కాలుతుంటే చలికాచుకునే ధోరణి ఎవరికైనా తాత్కాలికంగా ప్రయోజనం కలిగించవచ్చు. కానీ చివరకు ఆ మంటల్లో మిగిలేది బూడిద మాత్రమే! మంత్రి శ్రీధర్‌బాబు గతంలో వివిధ రాజకీయ సందర్భాల్లో తన అభిప్రాయాలను బలంగా వ్యక్తం చేసిన నాయకుడు. ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రభుత్వంలో ప్రస్తుత పాత్రను పరిగణనలోకి తీసుకుంటే.. ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై ఆయన వైఖరి ఎలా ఉందన్నది సహజంగానే చర్చకు వస్తోంది. అయితే ఆయనపై వినిపిస్తున్న రాజకీయ ఆరోపణలకు ఆధారాలు లేకుండా తుది నిర్ణయానికి రావడం తగదు. సంబంధిత నాయకులు తమ వైఖరిని స్పష్టం చేస్తే ఈ చర్చలకు తెరపడే అవకాశం ఉంటుంది.

నాయకుల మధ్య సమన్వయలోపం

ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌కు రాజకీయంగా, సామాజికంగా విస్తృత అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలో బీసీ, దళిత, గిరిజన వర్గాలతోపాటు భారీ సంఖ్యలో కార్మిక జనాభా ఉంది. పారిశ్రామిక ప్రాంతాలు, బొగ్గు గనులు, ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు ఈ ప్రాంత రాజకీయ స్వరూపాన్ని నిర్ణయిస్తాయి. ఇలాంటి చోట కార్మిక సంక్షేమం, ఉపాధి అవకాశాలు, పరిశ్రమల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ఈ రంగాల్లో పనిచేసే నాయకుల మధ్య సమన్వయం పెరిగితే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల్లో మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రాజకీయ నేపథ్యం, పారిశ్రామిక రంగంతో ఆయనకు ఉన్న అనుబంధం, కార్మిక సంక్షేమ అంశాలపై ఆయన నిర్వహిస్తున్న బాధ్యతలు ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో ఆయన పాత్రను ప్రాధాన్యంగా నిలుపుతున్నాయి. ఆయన చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలతో అనుసంధానం వంటి అంశాల ఆధారంగానే ఆయన రాజకీయ పనితీరును అంచనా వేయాలి. అదే సమయంలో ఒక నాయకుడి ఎదుగుదలను మరొక నాయకుడి పతనంగా చూడటం ఎంతవరకు సమంజసం? ఒకే పార్టీలో భిన్న నాయకత్వాలు బలపడితే పార్టీకి మరింత విస్తృతమైన ప్రజా పునాది ఏర్పడదా? అన్న అంశాలపై కాంగ్రెస్ నాయకత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. మంత్రి వివేక్ వెంకటస్వామి రాజకీయ నాయకుడిగానే కాకుండా, పారిశ్రామిక, మీడియా రంగాల్లోనూ అనుభవం కలిగిన వ్యక్తి. ఆయనకు ఉన్న వనరులు, అనుభవం, వివిధ సామాజిక వర్గాలతో ఉన్న అనుబంధం పార్టీ కార్యక్రమాలకు ఉపయోగపడే అంశాలుగా ఉన్నాయి. అలాంటి నాయకత్వాన్ని పార్టీ నిర్మాణాత్మకంగా ఉపయోగించుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణలో పార్టీతో ప్రజల అనుసంధానాన్ని విస్తరించే అవకాశం ఉంది. ఒక నాయకుడి వ్యక్తిగత ప్రాధాన్యాన్ని తగ్గించాలనే ఆలోచన కంటే.. ఆయన సామర్థ్యాన్ని పార్టీ ప్రయోజనాలకు ఎలా వినియోగించుకోవాలన్నదే ముఖ్యమైన ప్రశ్న కావాలి. వ్యక్తుల మధ్య ఆధిపత్య పోరు కంటే నాయకుల మధ్య సమన్వయం ఉంటేనే పార్టీ బలం పెరుగుతుంది. ఒక్క చేత్తో చప్పట్లు రావు. ఒకే లక్ష్యంతో పనిచేసే నాయకత్వం ఉంటేనే రాజకీయ విజయం సాధ్యమవుతుంది. కార్మికులకు భద్రత కావాలి. యువతకు ఉపాధి కావాలి. రైతులకు గిట్టుబాటు ధరలు కావాలి. పేదలకు సంక్షేమం అందాలి. ఉత్తర తెలంగాణలో కొత్త పరిశ్రమలు రావాలి. పెట్టుబడులు పెరగాలి. జిల్లాలకు అభివృద్ధి ఫలాలు అందాలి. ప్రజలు ఆశిస్తున్నది ఇదే. కానీ ఈ అంశాలన్నింటినీ పక్కనపెట్టి నాయకులు పరస్పరం రాజకీయ ఆధిపత్యం కోసం పోరాడితే నష్టపోయేది ఒక్క వ్యక్తి కాదు.. మొత్తం పార్టీ, ప్రభుత్వం, చివరకు ప్రజలే.

అధిష్ఠానం ఆలోచన ఏంటి?

కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పుడు ఆలోచించాల్సిన విషయం కూడా ఇదే. ఎవరి రాజకీయ ప్రాబల్యం పెరుగుతోంది? ఎవరి ప్రభావం తగ్గుతోంది? అన్నది కాదు.. ఉత్తర తెలంగాణలో పార్టీ ప్రజా పునాది ఎంత విస్తరిస్తోంది? ప్రభుత్వ పనితీరు ప్రజలకు ఎంత చేరువవుతోంది? నాయకుల మధ్య సమన్వయం ఎంత బలంగా ఉంది? అన్నదే ప్రాధాన్యం కావాలి. ఒక నాయకుడి ఎదుగుదలను అడ్డుకోవడానికి మరో నాయకుడు తెరవెనుక వ్యూహాలు రచిస్తున్నారనే ఆరోపణలు ఉంటే.. వాటిపై స్పష్టత రావాలి. అవి నిరాధారమైన ప్రచారాలైతే సంబంధిత నాయకులు వాటిని ఖండించాలి. వాస్తవంగా ఏమైనా అంతర్గత విభేదాలుంటే అధిష్ఠానం జోక్యం చేసుకుని పరిష్కరించాలి. ఎందుకంటే రాజకీయాల్లో పుకార్లకు చోటిస్తే అనుమానాలు పెరుగుతాయి.

ఐటీ కారిడార్‌లో ‘కౌంటర్ ఫ్లో’

మొదటి పేజీ తరువాయి

విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా వ్యవస్థను హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేయనుండటం విశేషం. సైబరాబాద్ పోలీసులు, కాంప్రహెన్సివ్ మొబిలిటీ సెల్ (సీఎంసీ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) ఈ ప్రాజెక్టును సంయుక్తంగా చేపట్టనున్నాయి. సాధారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఒకవైపు రహదారి విపరీతమైన రద్దీతో ఉంటే, మరోవైపు దాదాపు ఖాళీగా ఉంటుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, రద్దీకి వ్యతిరేక దిశలో (కౌంటర్ ఫ్లో) ఉన్న ఖాళీ మార్గంలో బస్సుల కోసం ప్రత్యేకంగా ఒక లేన్‌ను కేటాయిస్తారు. దీనివల్ల బస్సులు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానాలకు చేరుకుంటాయి. మొదటి దశలో జేఎన్టీయూ జంక్షన్ నుంచి కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రో స్టేషన్ మీదుగా బయోడైవర్సిటీ జంక్షన్/వేవ్‌రాక్ వరకు సుమారు 7 కిలోమీటర్ల మార్గాన్ని ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగంగా, పట్టణ రవాణా వ్యవస్థపై సమగ్ర అధ్యయనం కోసం ‘సైబరాబాద్ మూవ్స్-2026’ పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు టీ-హబ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇటీవల నిర్వహించిన సమావేశంలో సీఎంసీ కమిషనర్ జి.సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం.రమేశ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి సర్వేలు, ట్రాఫిక్ సిమ్యులేషన్లు, ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని అధికారులు తెలిపారు. అక్టోబర్ 29న సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఈ ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. రాయదుర్గం మెట్రో జంక్షన్ వద్ద బస్సులు తిరిగి సాధారణ ట్రాఫిక్‌లో కలిసే విధానం, పాదచారుల సౌకర్యాలు, లేన్లకు ఉన్న అడ్డంకులను తొలగించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ విధానం విజయవంతంగా అమలైతే సుమారు 15 లక్షల మంది వాహనదారులకు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటు హైటెక్ సిటీ-బయోడైవర్సిటీ ప్రాంతంలో ‘వన్-వే లూప్’ వ్యవస్థను ఏర్పాటు చేసే అంశం కూడా పరిశీలనలో ఉంది. తదుపరి సర్వేలు, ట్రయల్స్ అనంతరం ఈ ప్రాజెక్టుల అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఇండియానా.. ఎన్డీయేనా?

మొదటి పేజీ తరువాయి

తొలగించారని, కేంద్ర పెద్దల కనుసన్నల్లోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో సీఈసీ తొలగింపు తీర్మానం ప్రవేశపెడతామని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకే తాము ఈ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 1న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్ మింటో రోడ్ జంక్షన్ నుంచి అజ్మేరీ గేట్ మీదుగా రాంలీలా మైదానం వరకు ‘చలో ఢిల్లీ’ మార్చ్ చేపడుతున్నట్లు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ప్రజా సంఘాలు, యువత ఈ పాదయాత్రలో పాల్గొనాలని కోరారు. అయితే, కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ నిర్వహించడానికి ఎలాంటి పోలీసు అనుమతి తీసుకోలేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. న్యూఢిల్లీ పరిధిలో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, రాంలీలా మైదానం వద్ద పారామిలిటరీ బలగాలతో భారీ బందోబస్తు, ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఇండియా కూటమి ఆరోపణలను బీజేపీ తీవ్రంగా తిప్పికొట్టింది. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌ను, రాజ్యాంగ సంస్థలను అపహాస్యం చేస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర మండిపడ్డారు. దేశ పౌరులు మాత్రమే ఓటు వేసేలా ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని చెప్పారు. మరోవైపు, ఇండియా కూటమి ఆందోళనకు ప్రతిగా నవంబర్ 1నే రోహ్‌తక్ నగరంలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ఆధ్వర్యంలో ‘లోక్‌తంత్ర బచావో, అరాజక్త హటావో’ మహా ప్రదర్శనను బీజేపీ తలపెట్టింది. రాజధాని నగరంలో విపక్షాలు, పక్కనే ఉన్న హర్యానాలో అధికార పక్షం ఒకే రోజు భారీ ఎత్తున రోడ్లపైకి వస్తుండటంతో నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

నేటి నుంచి అయోధ్య కొత్త దర్శన వేళలు

మొదటి పేజీ తరువాయి

రాత్రి 10.30 గంటలకు బదులుగా 10 గంటలకే మూసివేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులకు రామ్‌లల్లా దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు బాలరాముడికి విశ్రాంతి సమయం కేటాయించారు. ఇప్పటివరకు ఈ విరామం కేవలం అరగంట మాత్రమే ఉండేది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మీడియా సలహాదారు సుభాష్ చంద్ర సింగ్ ఈ మార్పులను వెల్లడించారు. ప్రధాన అర్చకుడు ఆచార్య కేశవ్ కొత్త దినచర్యను రూపొందించినట్లు తెలిపారు. ఈ మార్పులతో భక్తులు దర్శన సమయాలను ముందుగానే తెలుసుకుని అయోధ్య పర్యటనను ప్లాన్ చేసుకోవాలని ఆలయ వర్గాలు సూచిస్తున్నాయి.

కబడ్డీలో భారత్ డబుల్ ధమాకా!

మొదటి పేజీ తరువాయి

జరిగిన తుదిపోరులో తొలుత మహిళల జట్టు, ఆ తర్వాత పురుషుల జట్టు విజయాలు సాధించి అభిమానుల్లో ఉత్సాహం నింపాయి. మహిళల ఫైనల్లో భారత జట్టు ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఉగాండా రక్షణశ్రేణిని ఛేదిస్తూ వరుసగా పాయింట్లు సాధించింది. దీంతో భారత్ 35-15తో 20 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. భారత జట్టు తరఫున సాక్షి 9 పాయింట్లతో మెరిసింది. అను సేన్ 6, కెప్టెన్ నిధి శర్మ 5 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఉగాండా తరఫున నకయోంగో షిరత్ 11 పాయింట్లు సాధించినప్పటికీ, మిగతా క్రీడాకారుల నుంచి తగిన సహకారం లభించకపోవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.

శ్రీలంకపై పురుషుల జైత్రయాత్ర

మహిళల విజయం తర్వాత పురుషుల జట్టు కూడా అదే జోరును కొనసాగించింది. ఫైనల్లో శ్రీలంకను 54-20తో చిత్తుచేసి 34 పాయింట్ల భారీ ఆధిక్యంతో విజేతగా నిలిచింది. తొలి అర్ధభాగంలోనే భారత్ 30-10తో ఆధిక్యం సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. రెండో అర్ధభాగంలోనూ దూకుడును తగ్గించకుండా ఆడి విజయాన్ని ఖాయం చేసుకుంది. భారత జట్టు తరఫున ఆదిత్య షిండే 10 పాయింట్లు సాధించి ముందుండగా, భరత్ హుడా 8 పాయింట్లతో రాణించాడు. పంకజ్ మోహితే 6, నవీన్ కుమార్ 5 పాయింట్లు సాధించి జట్టు విజయానికి తోడ్పడ్డారు.

అజేయ విజయాలతో సరికొత్త ఘనత

తొలిసారిగా జరిగిన ఈ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లోనూ భారత్ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడకుండా విజేతగా నిలవడం జట్టు పటిమను చాటింది. దాడుల్లో వేగం, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేసే వ్యూహాలు, సమన్వయంతో కూడిన ఆటతీరుతో భారత కబడ్డీ క్రీడాకారులు సత్తాచాటారు. రెండు విభాగాల్లోనూ టైటిళ్లు గెలవడం భారత కబడ్డీ ఖ్యాతిని మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పింది.

డ్రగ్స్ పార్టీలో 108 మంది విద్యార్థులు

మొదటి పేజీ తరువాయి

ఎంట్రీ ఫీజు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు చెల్లించిన వారికి చివరి నిమిషంలో ఫామ్‌హౌస్ లొకేషన్ పంపించి అక్కడికి రప్పించినట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ నిర్వహించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ పార్టీలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో శంకరపల్లి మండలం దొంతన్‌పల్లిలోని ఐబీఎస్ ఇఫ్కాయ్ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులు అధికంగా ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పార్టీ ప్రధాన నిర్వాహకుడు మన్సన్ గతంలో అదే విద్యాసంస్థలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించిన సమయంలో విద్యార్థులతో పరిచయం పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఆ పరిచయాల ఆధారంగా వారిని పార్టీకి ఆహ్వానించినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ పార్టీలో పలువురు యువతులు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎస్ఓటీ, చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. పోలీసులను చూసి కొందరు విద్యార్థులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో ప్రధాన నిర్వాహకుడు మన్సన్‌తో పాటు మరో ఇద్దరికి గంజాయి పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఏపీలో నేడే మున్సిపల్ పోలింగ్

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1o3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు



రామంతాపూర్ పెద్ద చెరువు వద్ద హైడ్రా కూల్చివేతలు

రామంతాపూర్, అక్టోబర్ 31 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు. ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆ తర్వాతే చట్టపరమైన తమ భూములపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలోనూ ఇదే చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టి, కొంత భూమిని పునరుద్ధరణ పనుల కోసం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకా?

ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్మజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. "ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. "ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?" అని ఆయన అన్నారు.

ఉద్యోగులకు 2 రోజుల వీక్లీ ఆఫ్

ప్రభుత్వానికి ఉద్యోగుల జేఏసీ ప్రతిపాదన

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో అమలవుతున్న తరహాలోనే రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ఉమ్మడి జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలు ఉన్నాయి. వీటిని ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మార్చాలని జేఏసీ ప్రతిపాదించింది. ఈ విధానం అమలైతే రోజుకు ఏడున్నర గంటల పనివేళలు ఉంటాయని, రెండో శనివారం సాధారణ సెలవును పరిగణనలోకి తీసుకుంటే వారానికి 37.5 గంటల పని పూర్తవుతుందని వివరించింది. ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్, ఇంధన కొరత ఏర్పడే అవకాశాలున్నాయని జేఏసీ తన వినతిపత్రంలో పేర్కొంది. వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్, నీటి వినియోగం తగ్గుతుందని తెలిపింది. వాహనాల రాకపోకలు తగ్గడం ద్వారా ఇంధనం ఆదా కావడంతో పాటు వాయు కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించింది. ఉద్యోగులకు వారానికి రెండు రోజుల విశ్రాంతి లభించడం వల్ల పని ఒత్తిడి తగ్గి సామర్థ్యం, పనితీరు మెరుగుపడతాయని జేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విధానం అమలుతో ప్రభుత్వ ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడదని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు.

పడకేసిన పాలమూరు ప్రాజెక్టులు

మూడేళ్లు గడుస్తున్నా ముందుకు కదలవేం?

కొడంగల్‌లో సీఎంపై డీకే అరుణ ఫైర్

కొడంగల్, అక్టోబర్ 31 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని ఆమె ఆరోపించారు. కొడంగల్‌లోని పున్నంచంద్ లాహోటి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నెట్టెంపాడు, కల్వకుర్తి, గట్టు లిఫ్ట్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ సమస్యను పరిష్కరించి రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమేంటని ఆమె మండిపడ్డారు. కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనుల కోసం ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ముందుగా నష్టపరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పరిహారం ఇవ్వకుండా వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ముఖ్యమంత్రిని ఆమె నేరుగా ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరైన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.



ఏపీకి మరో తుఫాను గండం

నెల్లూరు-నరసాపురం మధ్య తీరం దాటనున్న తీవ్ర తుఫాను

వైజాగ్, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది రేపటికి తుఫానుగా, ఆపై తీవ్ర తుఫానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకురానుంది. ఈ తుఫాను నవంబర్ 3వ తేదీ ఉదయం నెల్లూరు, నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకొచ్చని హెచ్చరించింది. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం, గత 6 గంటల్లో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఈ (అక్టోబర్ 31) అర్ధరాత్రికి ఇది తీవ్ర వాయుగుండంగా, రేపటికి (నవంబర్ 1న) తుఫానుగా, నవంబర్ 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఈ వాయుగుండం చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 960 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఆగ్నేయంగా 980 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 1,030 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. నవంబర్ 3వ తేదీ తెల్లవారుజామున ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంగా చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేయనున్నారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

రాష్ట్రానికి ఐదు రోజుల వర్ష సూచన



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం, అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో ఈరోజు సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది. ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు సూచించారు.

26 కోట్ల సైబర్ ఫ్రాడ్ కేసులో ఈడీ సోదాలు



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): సైబర్ మోసానికి సంబంధించిన భారీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. అల్లంరాజు సత్యనారాయణమూర్తికి చెందిన మూడు ప్రాంగణాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కేరళలోని ఎర్నాకుళం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది. కేసు వివరాల ప్రకారం.. నిమేష్ అనే వ్యక్తిని ఫోన్ కాల్స్, టెలిగ్రామ్ సందేశాల ద్వారా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సంప్రదించి, అధిక లాభాల పేరుతో ప్రలోభపెట్టారు. క్యాపిటలిక్స్.కామ్ అనే వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెడితే భారీ రాబడి లభిస్తుందని నమ్మించారు. వారి మాటలను విశ్వసించిన బాధితుడు, 2023 మే నుండి 2024 మే మధ్య కాలంలో సుమారు రూ. 26.02 కోట్లను నిందితులు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే, పెట్టిన పెట్టుబడి గానీ, లాభాలు గానీ తిరిగి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఈడీ, బాధితుల నుండి అక్రమంగా సేకరించిన నిధులను నిందితులు బినామీ ఖాతాలు, వివిధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించింది. బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్, ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వంటి సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ నిధులతో హైదరాబాద్‌లో ఒక విల్లా ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది. తాజాగా నిర్వహించిన సోదాల్లో అధికారులు కీలక పత్రాలను, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. రూ. 6.40 లక్షల నగదును సీజ్ చేయడంతో పాటు, 11 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 14 లక్షల నగదును స్తంభింపజేశారు. వీటితో పాటు దాదాపు రూ. 5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా వంటి స్థిరాస్తులను గుర్తించినట్లు ఈడీ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది.

తాగునీటి కోసం 120 కోట్లు

మంత్రి సీతక్క కీలక నిర్ణయం

నిజామాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అనుమతులు ఇచ్చేది మీరు..

కూల్చేసేది మీరేనా?

జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): 'నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం మీరే చేసి, ఇప్పుడు మళ్లీ వాటిని కూల్చివేయమని అడగడమేంటి?' అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భవన నిర్మాణ అనుమతులు, కూల్చివేతల విషయంలో జీహెచ్ఎంసీ వైరుధ్యపూరిత వైఖరిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. మల్కాజిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డిఫెన్స్ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సొసైటీ పరిధిలోని ప్లాట్లలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాల్ చేస్తూ నర్సింహారెడ్డి తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, సొసైటీకి చెందిన 6,039 చదరపు గజాల స్థలంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ నిర్మించి, వాహనాలు పార్క్ చేస్తోందని సొసైటీ మరో పిటిషన్ వేసింది. జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్ ఈ కేసును విచారించారు. తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని, లేఅవుట్ కూడా క్రమబద్ధీకరించారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, లేఅవుట్లను క్రమబద్ధీకరించిన తర్వాత, అందులోని ప్రజా వినియోగ స్థలాలను కాపాడాలని రెవెన్యూ, హైడ్రా శాఖలకు జీహెచ్ఎంసీ లేఖలు రాయడమేమిటని ప్రశ్నించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఏపీలో జంగిల్ రాజ్: జగన్



తాడేపల్లి, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతిభద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

జగన్ ఆస్తుల కేసు విచారణ ముమ్మరం

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ఆస్తుల కేసుల విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసుల విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఇండియా సిమెంట్స్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌లో దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు ముగిశాయి. అనంతరం, భారతీ సిమెంట్స్ కేసుకు సంబంధించిన పిటిషన్లపై విచారణను న్యాయస్థానం ప్రారంభించింది. దశాబ్ద కాలంగా ఈ కేసులు విచారణ దశలోనే నిలిచిపోయాయని, వీటిని వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో విచారణ ప్రక్రియ వేగమందుకుంది. హైకోర్టు ఆదేశాలతో సీబీఐ, ఈడీ కేసులపై న్యాయస్థానం రోజువారీ విచారణ చేపడుతోంది. ఇప్పటివరకు ఆరు సీబీఐ ఛార్జిషీట్లకు సంబంధించి మొత్తం 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. జగన్‌తో పాటు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, అయోధ్యరామిరెడ్డి వంటి పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. విచారణ పూర్తయిన ఈ 45 డిశ్చార్జి పిటిషన్లపై సీబీఐ కోర్టు ఒకేసారి తన ఆదేశాలను వెలువరించనుంది. దీంతో ఈ కేసుల భవిష్యత్తుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆగండి-ఆలోచించండి-ధ్రువీకరించండి.. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ పిలుపు.. పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన

జగిత్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): సైబర్ నేరాల నివారణకు అప్రమత్తత, అవగాహన ఎంతో ముఖ్యమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జగిత్యాల పట్టణంలో సైబర్ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ‘ఆగండి – ఆలోచించండి – ధృవీకరించండి’ అనే నినాదంతో పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ చౌరస్తా వరకు ప్రదర్శన కొనసాగింది. ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. నకిలీ లింకులు, ఒకసారి వినియోగించే సంకేత సంఖ్య (ఓటీపీ) మోసాలు, నకిలీ వినియోగదారుల సేవా నంబర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరిట ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకు, సందేశం లేదా ఫోన్ కాల్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా ముందుగా ఆగాలని, ఆ సమాచారం వెనుక ఉద్దేశాన్ని ఆలోచించాలని, అనంతరం సంబంధిత వ్యక్తులు, వెబ్‌సైట్లు, సమాచార వాస్తవికతను అధికారిక మార్గాల్లో ధృవీకరించుకోవాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు ఈ మూడు సూత్రాలను తమ రోజువారీ డిజిటల్ కార్యకలాపాల్లో భాగం చేసుకోవాలని, ఇతరులకూ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్సైలు కిరణ్ కుమార్, దినేష్, మహేష్, మల్లేష్, సుప్రియ, సైబర్ క్రైమ్ సిబ్బంది, వైద్య కళాశాల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.





రాష్ట్రపతి నిలయ సందర్శనలో కిడ్స్ కాన్వెంట్ విద్యార్థులు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 31 (ఈవార్తలు): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. ఈ సందర్శనంగా అక్కడి వివిధ విభాగాలను పరిశీలించి, రాష్ట్రపతి నిలయం గురించి, అక్కడ నిర్వహించే కార్యక్రమాల గురించి అవగాహన పొందారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ‘ఒకే భారతం–ఒకే దేశం’ అంటూ నినాదాలు చేస్తూ దేశ సమైక్యతను చాటారు. అనంతరం జాతీయ ఐక్యత అంశంపై నిర్వహించిన ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. రాష్ట్రపతి నిలయం గురించి ఉపాధ్యాయులు, అక్కడి సిబ్బంది విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యా పర్యటనలు అవసరమని పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్ అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని ప్రిన్సిపల్ దరక్షన్ వస్పియా పేర్కొన్నారు.

మన మనీషా ‘బంగారం’

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



మల్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా తాటిపల్లి గురుకుల కళాశాల విద్యార్థిని ఆర్. మనీషా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటింది. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–19 బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో 3,000 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయంతో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మనీషా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ మానస, వ్యాయామ విద్యా ఉపాధ్యాయురాలు మధులిక తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభ కనబరిచి కళాశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు. మనీషా విజయంపై గ్రామ సర్పంచ్, కళాశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై అవగాహన

మల్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యతపై అవగాహన కల్పించేందుకు శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుల ఒత్తిడి, పరీక్షల భయం, ఆందోళన, నిరాశ, తోటి విద్యార్థుల వేధింపులు, స్నేహితుల ప్రభావం, సెల్‌ఫోన్ల అధిక వినియోగం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన సలహాలు, సహాయం అందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం, ఆత్మహత్యలను నివారించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. విద్యార్థులు తమ సమస్యలను భయం, సంకోచం లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్య సిబ్బందితో పంచుకోవాలని సూచించారు. సానుకూల ఆలోచనా విధానం, జీవిత నైపుణ్యాలు, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. మానసిక సమస్యలకు చికిత్స, సహాయం అందుబాటులో ఉన్నాయని, ఇతరుల సహాయం కోరడం బలహీనత కాదని, ధైర్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ప్రశాంతమైన, ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందన్నారు. ‘ఆరోగ్యకరమైన మనస్సు–ఆరోగ్యకరమైన విద్యార్థి–ఆరోగ్యకరమైన సమాజం’ అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు

కూకట్‌పల్లి, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఉమ్మడి హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా కూకట్‌పల్లిలో శనివారం గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్య గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు, ప్రజలు పాల్గొని ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు రంగమోహన్, నలినీకాంత్, రవి, కళ్యాణ్, రమణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఓటర్లతో సమన్వయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పట్టభద్రుల భాగస్వామ్యం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల అభివృద్ధి, సంక్షేమం, అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ‘మన ఓటు–మన హక్కు–మన అభ్యర్థి విజయం’ అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

సకాలంలో వైద్యం అందక మహిళ మృతి

జగిత్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): సకాలంలో వైద్యం అందక బండారి సుశీల మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన సుశీల కుటుంబాన్ని శనివారం పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిమ్స్‌లో వెంటిలేటర్ అందుబాటులో లేక ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారని, అక్కడ శస్త్రచికిత్స పరికరం పనిచేయడం లేదని చెప్పడంతో ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు. గాంధీ ఆసుపత్రిలో ఏడాదిగా పరికరం పనిచేయకపోయినా మరమ్మతులు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని, అవసరమైన వైద్య పరికరాలు, వెంటిలేటర్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మాజీ జెడ్పీటీసీలు రమణ, శంకర్, మాజీ ఎంపీపీ రమేష్, నాయకులు సుభాష్, జోగిరెడ్డి తదితరులు ఉన్నారు.

దేశ సమైక్యతకు పటేల్ సేవలు

చిరస్మరణీయం: ఏసీఎస్ రాజు



జగిత్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని భారత్ సురక్షా సమితి జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు నేతృత్వంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఉన్న పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసీఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ సంయోజక్ చిట్ల గంగాధర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం 565కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలోనూ ఆయన ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. పటేల్ సేవలకు గుర్తుగా ఆయన జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశానికి సేవలందించిన మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి సింగం గంగాధర్, 22వ వార్డు కౌన్సిలర్ ఆరవ లక్ష్మి, కొత్తకొండ బాలన్న, గాదాసు భూమన్న, నరేందుల శ్రీనివాస్, ఎడమల వెంకట్ రెడ్డి, చిలుక రాజన్న, వంగల భాస్కర్, ఇల్లెందుల పురుషోత్తం, గంద్ర ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేసుల తీర్పుల్లో ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం

జగిత్యాల ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్న పద్మావతి



జగిత్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): నేర దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో ఫోరెన్సిక్ శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్న పద్మావతి అన్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఫోరెన్సిక్ శాస్త్రంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రత్న పద్మావతి మాట్లాడుతూ నేరస్థల పరిశీలన, భౌతిక ఆధారాల గుర్తింపు, పరిరక్షణ, చేతిరాత, సంతకాల పరిశీలన, సంతకాల నకిలీ, పత్రాల ప్రామాణికత, వేలిముద్రలు, డీఎన్ఏ పరీక్షలు, సైబర్, డిజిటల్ ఫోరెన్సిక్ అంశాలపై న్యాయవాదులకు అవగాహన ఉండాలని తెలిపారు. వివిధ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్ పరీక్షలు తీర్పులపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రోబ్ ల్యాబ్ ఫోరెన్సిక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మోహన్ ఎర్రగొల్ల ప్రధాన వక్తగా పాల్గొని ఫోరెన్సిక్ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి.నాగేశ్వర్ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మట్ట సరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య, ఉపాధ్యక్షుడు మర్రిపెల్లి సత్యప్రకాశ్, సీనియర్ న్యాయవాదులు రాచకొండ శ్రీరాములు, బండ భాస్కర్ రెడ్డి, మెట్ట మహేందర్, చెందోలి లక్ష్మణ్, ఎనగంటి రామచంద్రం, కరవత్తుల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నెయ్యి ప్రజారోగ్యానికి కీలకం: చిన్నజీయర్ స్వామి



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): స్వచ్ఛమైన నెయ్యిని అందించడం కేవలం వ్యాపార అంశం కాదని, ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న కీలకమైన విషయమని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఆశీర్వాద్ ఫుడ్స్ కార్యాలయంలో సంస్థ సొంత బ్రాండ్ ‘కామధేను సెలెక్ట్ నెయ్యి’, ఆహార వినియోగానికి అనువైన టెట్రా ప్యాక్‌లను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ పాడి రైతుల నుంచి నేరుగా పాలను సేకరించి, సంప్రదాయ పద్ధతిలో పెరుగును చిలికి తీసిన వెన్నతో నెయ్యి తయారు చేస్తున్న ఆశీర్వాద్ ఫుడ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. నెయ్యి తయారీలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు వినియోగదారులకు పారదర్శకంగా ఉత్పత్తులను అందించడం వల్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. స్వచ్ఛమైన ఆహార పదార్థాలు ప్రజారోగ్యానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వేణుగోపాలచారి, ఆశీర్వాద్ ఫుడ్స్ ప్రతినిధులు గోవింద్ అగర్వాల్, రేణు అగర్వాల్, కునాల్ అగర్వాల్, రితిక, చవి తదితరులు పాల్గొన్నారు.

రోజారీ బాలికల పాఠశాలలో విజ్ఞాన, కళా ప్రదర్శన



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): విద్యార్థినుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, నూతన ఆలోచనలను వెలికితీసే లక్ష్యంతో గన్‌ఫౌండ్రీలోని రోజరీ బాలికల పాఠశాలలో శనివారం విజ్ఞాన, గణిత, సాంఘిక, సాంకేతిక, సాహిత్య, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్ఫిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు, న్యాయనిర్ణేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రదర్శనలో పర్యావరణ పరిరక్షణ, విద్య, సామాజిక అంశాలతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థినులు ప్రదర్శించారు. ప్రతి నమూనా వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలు, వాటి ఉపయోగాలు, సామాజిక ప్రాధాన్యతను ఆత్మవిశ్వాసంతో వివరించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా సిస్టర్ జోస్ఫిన్ మాట్లాడుతూ పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక పరిజ్ఞానం విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమని అన్నారు. ఇలాంటి ప్రదర్శనలు పరిశోధనాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యం, బృంద స్ఫూర్తి, వేదికపై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థినుల ప్రాజెక్టులను తిలకించేందుకు తల్లిదండ్రులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభినందించారు. యాజమాన్యం, ఉపాధ్యాయుల సహకారంతో ప్రదర్శన విజయవంతమైంది.



మహిళా సంఘం భవనానికి ఎంపీ నిధులు: భోగ శ్రావణి

జగిత్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): రాయికల్ మండలం రామాజీపేటలో మహిళా సంఘం భవన నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు భవన నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాన్ని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ భోగ శ్రావణి మహిళా సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, సభ్యుల సమావేశాల నిర్వహణకు ప్రత్యేక భవనం అవసరమని అన్నారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, ప్రధాన కార్యదర్శి వట్టిమల్ల శ్రీనివాస్, నాయకులు కోల శంకర్, కంటే భూమేష్, రవి కిరణ్, ఆర్మూర్ రెడ్డి, ఇద్దం గంగిరెడ్డి, ఏనుగంటి హరీష్, మక్కాల సాయి, బోయిని నరేందర్ తదితరులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

‘యువతతోనే వికసిత్ భారత్ సాధ్యం’

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): యువత దేశ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని ప్రగతి మహావిద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి లత పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం, బాధ్యతాయుత ఓటింగ్‌పై యువతకు అవగాహన కల్పించేందుకు మేరా యువ భారత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం ప్రగతి మహావిద్యాలయంలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్, వికసిత్ భారత్ యువ సంవాద్ కార్యక్రమాలు నిర్వహించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం డాక్టర్ మాధవి లత మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మేరా యువ భారత్ హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఇన్‌చార్జ్ గంటా రాజేష్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ కార్యకలాపాలు, వికసిత్ భారత్ యువ నాయకుల చర్చల లక్ష్యాలు, ప్రాధాన్యతను వివరించారు. ‘నో యువర్ ఓట్’ అంశంపై యువ ప్రతినిధి జి. కార్తీక్ ప్రసంగిస్తూ ఎన్నికలపై అవగాహన, బాధ్యతాయుతంగా ఓటు వేయడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కావడం గురించి వివరించారు. ‘నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్’ అంశంపై నిపుణులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో మనోజ్ ఖన్నా మాదకద్రవ్యాల నివారణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞలు చేయించారు. యువత తమ పౌర బాధ్యతలను నిర్వర్తిస్తూ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కృషి చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఎంఎస్ఎఫ్ గ్రేటర్ ఇన్‌చార్జ్‌గా రామారపు

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జ్‌గా రామారపు శ్రీనివాస్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ శనివారం ప్రకటన విడుదల చేశారు. కాచిగూడ ఎస్సీ హాస్టల్‌కు చెందిన రామారపు శ్రీనివాస్ ఇప్పటివరకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. కొత్త బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఆయన బాగ్ అంబర్‌పేటలో మంద కృష్ణ మాదిగను కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎంఎస్ఎఫ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నగరంలోని విద్యాసంస్థలు, వసతి గృహాల్లో త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంఎస్ఎఫ్ ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు.





దళారులను
నమ్మి మోసపోవద్దు: అడ్లూరి

జగిత్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. జగిత్యాల మండలం కొత్తపేట గ్రామంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని, ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.



నిరుపేద యువతి
పెళ్లికి భోజేందర్ రెడ్డి సాయం

గొల్లపల్లి, అక్టోబర్ 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామానికి చెందిన నస్పూరి లస్మయ్య కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో ఆయన మనవరాలు లక్ష్మి వివాహానికి సామాజిక సేవకుడు ఎడమల భోజేందర్ రెడ్డి రూ.5 వేల సాయం అందించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి ఆర్థిక సహకారం అందించారు. అనంతరం ప్రమాదంలో చేయి విరిగి చికిత్స పొందుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కట్ట వెంకట రమణను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధెంకి లక్ష్మి మల్లారెడ్డి, గుర్రం రంజిత్ రెడ్డి, అవారి చందు, భీమా సత్యం, బండారి శ్రీనివాస్, లక్కాకుల వినోద్, పొలస రాయమల్లు, బండారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయాల వద్ద హలాల్ వద్దు

ప్రహరీ గోడలపై ప్రకటనలు ఏర్పాటు

మల్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): గ్రామంలోని పోచమ్మ ఆలయాల వద్ద హలాల్ విధానాన్ని అనుసరించడంపై ఆలయ కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. గతంలో గ్రామానికి చెందిన ఒక వర్గం వారు ముస్లిం వ్యక్తితో హలాల్ చేయించినట్లు కమిటీ పేర్కొంది. ఆ విధానాన్ని కొనసాగించవద్దని సూచించినప్పటికీ, మరోసారి అదే విధంగా చేయించినట్లు తెలిపింది. ఈ విషయంపై ఆగస్టు 27న నిర్వహించిన గ్రామసభలో హిందూ దేవాలయాల వద్ద హలాల్ విధానం చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలకు విషయం తెలియజేసేందుకు పోచమ్మ ఆలయాల ప్రహరీ గోడలపై రాతపూర్వక ప్రకటనలు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. గ్రామ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కమిటీ కోరింది.

బీజేపీ స్వచ్ఛ భారత్
సెల్ కన్వీనర్‌గా కేఎం కృష్ణ



బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 31 (ఈవార్తలు): బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్‌గా బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు కే.ఎం.కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీ.భరత్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గతంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశానని తెలిపారు. తనకు అప్పగించిన కొత్త బాధ్యతను నిజాయితీగా, అంకితభావంతో నిర్వహిస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టాల అంచనాకు
క్రాప్ బుకింగ్ వివరాలే ప్రామాణికం

ప్రభుత్వానికి ఏఈఓల ఐక్యవేదిక విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): వానాకాలం 2026లో కరువు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంట నష్టాల అంచనాకు ఇప్పటికే నమోదైన పంట నమోదు వివరాలనే ప్రామాణికంగా తీసుకోవాలని ఏఈఓల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని కోరింది. పంట నమోదు వివరాల ఆధారంగా అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేసింది. ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయ విస్తరణ అధికారుల నియంత్రణలో ఉండవని, పంట నష్టాల పేరుతో వారిని బాధ్యులను చేయడం సరికాదని పేర్కొంది. ఇప్పటికే పనిభారంతో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులపై అదనపు సర్వేలు మోపకుండా, పంట నమోదు వివరాల ఆధారంగా నష్టాలను అంచనా వేసేలా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేయాలని ఐక్యవేదిక కోరింది.

ఐఫోన్ డ్యుయో స్క్రీన్‌పై పగుళ్లు

అవసరమైతే కొత్త ఫోన్ ఇస్తాం: యాపిల్



ముంబై: యాపిల్ తొలి ఫోల్డబుల్ ఫోన్ ఐఫోన్ డ్యుయో వినియోగదారులకు ఎదురవుతున్న స్క్రీన్ సమస్యపై ఆ సంస్థ స్పందించింది. ఫోన్ లోపలి డిస్‌ప్లే పగుళ్లకు గురవుతోందంటూ కొందరు వినియోగదారులు ఫిర్యాదులు చేయడంతో.. తమ రిటైల్ స్టోర్లు, అధీకృత సర్వీస్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. సమస్యతో వచ్చిన ఫోన్లను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రామాణిక సర్వీసింగ్ విధానాల ప్రకారం రిపేర్ చేయాలని లేదా అవసరమైతే కొత్త ఫోన్ ఇవ్వాలని సిబ్బందికి సూచించింది. ఈ మేరకు అంతర్గత మెమో పంపినట్లు 'మాక్‌రూమర్స్' వెల్లడించింది. ఐఫోన్ డ్యుయో వినియోగంలోకి వచ్చిన కొన్ని రోజులకే స్క్రీన్‌పై పగుళ్లు, ప్రకాశవంతమైన గీతలు కనిపిస్తున్నాయంటూ కొందరు వినియోగదారులు సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేశారు. ముఖ్యంగా ఫోన్ మడిచే మధ్య భాగంలోని హింజ్ దగ్గర ఈ సమస్య కనిపిస్తున్నట్లు తెలిపారు. ఆస్ట్రేలియాకు చెందిన ఓ వినియోగదారుడు తన ఫోన్ 20 సార్లు కూడా తెరవకముందే డిస్‌ప్లే దెబ్బతిన్నట్లు సోషల్ మీడియాలో వెల్లడించాడు. ఈ సమస్యకు కారణం ఏంటో యాపిల్ అధికారికంగా వెల్లడించలేదు. అయితే, రిపేర్ సంస్థ ఐఫిక్సిట్ చేసిన పరిశీలనలో హింజ్ వ్యవస్థలో లోపం ఉండే అవకాశం ఉందని తేలింది. ఫోన్‌ను మడిచినప్పుడు హింజ్‌లోని సెంట్రల్ సపోర్ట్ బార్ పూర్తిగా వెనక్కి జరగకపోవడం వల్ల డిస్‌ప్లేపై ఒత్తిడి పెరిగి పగుళ్లు ఏర్పడవచ్చని అంచనా వేసింది. యాపిల్ దీనిని ధ్రువీకరించలేదని స్పష్టం చేసింది. ఈ సమస్య కొన్ని ఫోన్లకే పరిమితమని యాపిల్ చెబుతోంది. ఇప్పటివరకు ఎలాంటి రీకాల్ ప్రకటించలేదు. ప్రత్యేకంగా అందరికీ వర్తించే ఉచిత రిపేర్ ప్రోగ్రామ్‌ను కూడా ప్రారంభించలేదు. సమస్య ఎదురైన వినియోగదారులు యాపిల్‌కేర్‌ను సంప్రదించాలని లేదా అధీకృత సర్వీస్ కేంద్రాన్ని సందర్శించాలని సూచించింది.

సీఈసీపై ఇండియా కూటమి ప్రజా అభిశంసన

బీజేపీ గెలుపు చట్టవిరుద్ధమన్న రాహుల్



న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. భారీ ఎత్తున ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేశారని, బీజేపీ ఎంపీలు అక్రమంగా లోక్‌సభలో అడుగుపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి శనివారం నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో రాహుల్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా సుమారు 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 15 శాతానికి సమానం. అనేక నియోజకవర్గాల్లో గెలుపు మార్జిన్ కేవలం 3 శాతం మాత్రమే ఉన్నప్పుడు, ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించడం ఎన్నికల నిష్పాక్షికతపై తీవ్రమైన సందేహాలు రేకెత్తిస్తోంది" అని అన్నారు. "2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, బీజేపీ సభ్యులు అక్రమంగా పార్లమెంటులోకి ప్రవేశించారని స్వయంగా ఎన్నికల సంఘమే పరోక్షంగా అంగీకరిస్తోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న నాయకత్వం తనను కాపాడుతుందని సీఈసీ భావిస్తే పొరపాటని, ప్రజల ఆగ్రహాన్ని గమనించాలని హెచ్చరించారు. "మీరు ఓట్ల దొంగతనానికి సహకరిస్తూనే ఉండండి. కానీ వీధుల్లో ఉన్న ప్రజలు మీరు వారికి చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మర్చిపోరని నేను హామీ ఇస్తున్నాను" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. సీఈసీకి వ్యతిరేకంగా లాంఛనప్రాయ ప్రజా అభిశంసనను ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ ఆత్మపైనే దాడి చేస్తోందని, పార్లమెంటులో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు కనీస అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ హక్కులపై అవగాహన

అక్షయ విద్యాలయంలో అనంత లా కళాశాల ఆధ్వర్యంలో శిబిరం



మల్కాపూర్, అక్టోబర్ 31 (ఈవార్తలు): విద్యార్థులకు చట్టపరమైన హక్కులు, ఇటీవలి న్యాయపరమైన పరిణామాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు సంగారెడ్డి జిల్లా మల్కాపూర్‌లోని అక్షయ విద్యాలయంలో శనివారం అనంత లా కళాశాల ఆధ్వర్యంలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అనంత లా కళాశాల కరస్పాండెంట్ రవి అనంత సహకారం అందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. చంద్రమతి విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని, తమ హక్కుల కోసం నిర్భయంగా నిలబడాలని సూచించారు. అనంతరం అక్షయ విద్యాలయ ప్రిన్సిపల్ టి.సుధాకర్ జోషి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.జ్యోత్స్నలను డాక్టర్ చంద్రమతి సత్కరించారు. అనంత లా కళాశాల విద్యార్థులు వివిధ చట్టాలపై నాటికలు ప్రదర్శించి, వాటి ద్వారా చట్టాల పట్ల అవగాహన కల్పించారు. కళాశాల న్యాయ సహాయ విభాగం ఇన్‌చార్జ్ లక్ష్మీ ప్రసన్న పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో
కరెంట్ షాక్..
ఇద్దరు విదేశీయులు మృతి

బెంగళూరు: బెంగళూరులోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో విషాదం చోటుచేసుకుంది. స్విమ్మింగ్ పూల్‌లో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు విదేశీయులు ప్రాణాలు కోల్పోయారు. వారిని కాపాడేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం ఉల్సూర్‌లోని కాన్రాడ్ హోటల్‌లో ఈ ఘటన జరిగింది. మృతుల్లో జర్మనీకి చెందిన వ్యక్తి, స్లోవేకియా జాతీయుడు ఉన్నట్లు సమాచారం. హోటల్ మూడో అంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు విదేశీయులు నీటిలో ఉండగా విద్యుత్ ప్రవాహం కారణంగా ప్రమాదానికి గురైనట్లు ప్రాథమిక సమాచారం. వారిని రక్షించేందుకు ప్రయత్నించిన ఓ అమెరికా పర్యాటకుడు, హోటల్‌లో పనిచేసే స్విమ్మింగ్ పూల్ అటెండెంట్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యారు. గాయపడిన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. స్విమ్మింగ్ పూల్‌లోకి విద్యుత్ ప్రవాహం ఎలా వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పూల్‌లోని విద్యుత్ పరికరాలు, వైరింగ్ వ్యవస్థను పరిశీలించే అవకాశం ఉంది. ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియాల్సి ఉంది. బాధ్యులెవరో తేల్చేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

జైలు నుంచి 17 మంది
ఖైదీలు పరార్

చెన్నై: తమిళనాడులోని తేని జిల్లా జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో బాధ్యులను చేస్తూ తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను సస్పెండ్ చేయగా, మరో సీనియర్ అధికారిని బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, నిఘాను పటిష్ఠం చేయాలని ముఖ్యమంత్రి విజయ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను అక్టోబర్ 30 నుంచి తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకు సస్పెండ్ చేశారు. అదేవిధంగా మధురై సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న ఆర్. కృష్ణరాజ్‌ను సేలం సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరించారు. అక్టోబర్ 26న తేని జిల్లాలోని టెక్కంపట్టి సబ్-జైలులో ఈ ఘటన జరిగింది. వైద్యపరమైన అత్యవసర పరిస్థితిని సృష్టించిన ఖైదీలు, జైలు గార్డులపై దాడి చేసి, వారి నుంచి తాళాలు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారైన 17 మందినీ తిరిగి పట్టుకున్నారు. ఈ జైలు బ్రేక్ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల భద్రతపై ప్రభుత్వం సమీక్ష ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై 9 మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు.



కాంగ్రెస్ హయాంలో పటేల్
గౌరవం దక్కలేదు: అమిత్ షా

న్యూఢిల్లీ: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు దక్కాల్సిన గౌరవం కాంగ్రెస్ పాలనలో లభించలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆయనను పక్కనపెట్టి, ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రయత్నించిందని ఆరోపించారు. పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం ఢిల్లీలో నిర్వహించిన 'ఏక్తా రన్' కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సర్దార్ పటేల్ స్మారకంగా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహమైన 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని నిర్మించారని షా గుర్తుచేశారు. ఈ స్మారక నిర్మాణం ద్వారా పటేల్ సేవలు, ఆయన వ్యక్తిత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేశారని పేర్కొన్నారు. దేశ సమైక్యతకు పటేల్ చేసిన కృషిని అమిత్ షా ప్రస్తావించారు. కేవలం 1,218 రోజుల్లోనే ఆయన అవిభాజ్య భారతదేశ నిర్మాణానికి పునాది వేశారని అన్నారు. పలువురు నాయకులు కలిసి జీవితకాలంలో సాధించలేని పనులను పటేల్ తక్కువ సమయంలోనే పూర్తి చేశారని వ్యాఖ్యానించారు. దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని షా పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 'నషా ముక్త్ భారత్' సాధనతోనే 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా ముందడుగు వేయగలమని అన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజం నిర్మూలన దిశగా దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైందని, నక్సలిజం నిర్మూలనకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు.

ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ కన్ను

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక అసలు లక్ష్యం ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. 'గ్రీక్ సిటీ టైమ్స్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది. పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది. దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదో బిడ్డ కావాలన్న జేడీ వాన్స్

అర్ధాంగి ఉష నుంచి వార్నింగ్



వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ సరదా సంభాషణను పంచుకున్నారు. ఐదో బిడ్డను కందామంటూ తాను చేసిన ప్రతిపాదనకు తన భార్య ఉష వాన్స్ నుంచి ఎలాంటి స్పందన వచ్చిందో ఆయన ఓ ఇంటర్వ్యూలో నవ్వుతూ వివరించారు. ఈ సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారితీసింది. 'ఫాక్స్' న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. తనకు ఆరుగురు పిల్లలు ఉండాలనేది కోరిక అని తెలిపారు. "కొన్ని రోజుల క్రితం నేను మా ఆవిడ ఉషాతో సరదాగా అన్నాను. మనం ఐదో బిడ్డను కూడా కనేస్తే బాగుంటుంది కదా అని అడిగాను" అని వాన్స్ చెప్పారు. ఆ సమయంలో వారి మూడు నెలల చిన్నారి బాగోగులు చూసుకుంటున్న ఉష, ఆయన మాటలకు వెంటనే స్పందించారు."మూడు నెలల బాబుతో ఉన్నప్పుడు మళ్లీ పిల్లల గురించి జోక్ చేస్తే, మీకు 'వాసెక్టమీ' చేయిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటిస్తాను అని ఆమె హెచ్చరించింది. దాంతో నేను ఆ ప్రస్తావనను అక్కడితో ఆపేశాను" అని జేడీ వాన్స్ నవ్వుతూ తెలిపారు. వాన్స్ దంపతులకు ఇప్పటికే నలుగురు పిల్లలు ఉన్నారు. వారి పేర్లు ఇవాన్, వివేక్, మిరాబెల్ కాగా, నాలుగో సంతానమైన అలెక్ వయసు మూడు నెలలు. ఈ సరదా సంభాషణపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. చాలా మంది నెటిజన్లు ఇది ప్రతి కుటుంబంలో జరిగే ఓ సాధారణ సన్నివేశంలా ఉందని, ఎంతో సహజంగా అనిపించిందని కామెంట్ చేశారు. అయితే, మరికొందరు మాత్రం కుటుంబ నియంత్రణ వంటి సున్నితమైన అంశంపై బహిరంగంగా జోకులు వేయడాన్ని ప్రశ్నించారు. ఏదేమైనా ఒక దేశ ఉపాధ్యక్షుడి కుటుంబంలోని ఈ తేలికపాటి సంభాషణ, ఆయన వ్యక్తిగత జీవితంలోని మరో కోణాన్ని ప్రజలకు పరిచయం చేసింది.



అవార్డులతో 'ధురంధర్' సెన్సేషన్!



భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 26వ ఐఫా 2026 అవార్డుల ప్రకటన వచ్చేసింది! ఈ ఏడాది అవార్డుల రేసులో అగ్ర కథానాయకుడు రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' చిత్రం ఊహించని రీతిలో రికార్డులను తిరగరాసింది. ప్రధాన విభాగాలు, సాంకేతిక విభాగాలు కలిపి ఏకంగా 12 ట్రోఫీలని సొంతం చేసుకుని సంచలనం సృష్టించింది. మరోవైపు యూత్‌ఫుల్ మూవీ 'సైయారా' 5 అవార్డులను దక్కించుకోగా, డిజిటల్ ఓటీటీ విభాగంలో ఆర్యన్ ఖాన్ వెబ్ సిరీస్ విశేషంగా నిలిచింది. ఆదిత్య ధార్ దర్శకత్వంలో వచ్చిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్' ఈసారి ఐఫా అవార్డుల వేదికపై దండయాత్ర చేసింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు (ఆదిత్య ధార్), ఉత్తమ నటుడు (రణ్‌వీర్ సింగ్), ఉత్తమ సహాయ నటుడు (సంజయ్ దత్), ఉత్తమ నెగెటివ్ రోల్ (అక్షయ్ ఖన్నా) వంటి అత్యంత ప్రధానమైన అవార్డులన్నీ ఈ సినిమాకే దక్కడం విశేషం. అంతేకాకుండా స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ మరియు సౌండ్ డిజైన్ విభాగాల్లోనూ 'ధురంధర్' తన ఆధిపత్యాన్ని చాటుకుంది. యూత్ అండ్ మ్యూజికల్ హిట్ 'సైయారా' చిత్రం మొత్తం 5 అవార్డులను తన ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రంలో అద్భుత నటనకు గాను అనేత్ పడ్డా 'ఉత్తమ నటి'గా ఎంపికయ్యారు. అలాగే ఈ సినిమా ద్వారా పరిచయమైన ఆహాన్ పాండే 'ఉత్తమ అరంగేట్ర నటుడు (డెబ్యూ)' అవార్డును గెలుచుకున్నారు. బెస్ట్ లిరిక్స్ (ఇర్షాద్ కామిల్), బెస్ట్ మేల్ సింగర్ (ఫహీమ్ అబ్దుల్లా), బెస్ట్ ఫిమేల్ సింగర్ (శ్రేయా ఘోషాల్) కేటగిరీల్లో 'సాయియారా' పాటలు టాప్‌లో నిలిచాయి. సాంకేతిక విభాగాల్లో ధురంధర్‌తో పాటు 'ఛావా' చిత్రం కూడా మంచి ప్రతిభ కనబరిచింది. ఛావా చిత్రానికి గాను దిగ్గజ సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ 'ఉత్తమ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్' అవార్డును అందుకోగా, బెస్ట్ విజ్యూవల్ ఎఫెక్ట్స్ కూడా ఛావాకే దక్కింది. ఇక రాషా తడాని 'ఆజాద్' చిత్రానికి గాను 'ఉత్తమ అరంగేట్ర నటి'గా ఎంపికవ్వగా, బెస్ట్ కొరియోగ్రఫీ అవార్డు 'వార్ 2' కి దక్కింది. ఈ ఏడాది డిజిటల్ రంగానికి సంబంధించి ప్రత్యేక విభాగాల్లో అవార్డులు అందించారు. ఆర్యన్ ఖాన్ తొలిసారి దర్శకత్వం వహించిన 'ది బాడ్స్ ఆఫ్ బాలీవుడ్' బెస్ట్ సిరీస్‌గా నిలవడమే కాకుండా, ఆయనకు బెస్ట్ డైరెక్టర్ అవార్డును కూడా తెచ్చిపెట్టింది. ఇక డిజిటల్ మూవీస్ విభాగంలో 'బారాముల్లా' బెస్ట్ పిక్చర్‌గా, 'స్టోలెన్' చిత్రానికి గాను అభిషేక్ బెనర్జీ ఉత్తమ నటుడిగా, 'మిసెస్' చిత్రానికి గాను సాన్యా మల్హోత్రా ఉత్తమ నటిగా అవార్డులు గెలుచుకున్నారు. ఇక మొత్తానికి 2026 ఐఫా అవార్డుల పండగలో కంటెంట్ ఉన్న సినిమాలకు, ప్రతిభగల నటీనటులకు తగిన గౌరవం దక్కింది. బిగ్ స్క్రీన్ పై 'ధురంధర్' సృష్టించిన ప్రభంజనం, డిజిటల్ స్పేస్ లో కొత్త దర్శకుల జోరు సినీ అభిమానులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. మరి ఈ విజేతల జాబితాలో మీ ఫేవరెట్ హీరో, సినిమా ఉన్నాయో లేదో కామెంట్ చేయండి.



ఇదేం వ్యవహారం

టాలీవుడ్, కోలీవుడ్ పరిశ్రమల్లో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అందాల తార అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఓ క్రిప్టిక్ పోస్ట్ చర్చనీయాంశమైంది. సమాజంలో .. చిత్ర పరిశ్రమలో వ్యక్తుల పట్ల వ్యక్తమవుతున్న ద్వంద్వ ప్రమాదాలు .. ప్రవర్తనా తీరుపై అమ్మడు పరోక్షంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరినైనా ఒకే రకమైన విషయాల కోసం నిందించే సమాజం.. వేరే వ్యక్తులు అదే పని చేసినప్పుడు మాత్రం దాన్ని తేలిగ్గా తీసుకుంటుందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ వేదికగా పంచుకున్న నోట్‌లో ఒకప్పుడు చేసిన కొన్ని పనులకే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని.. కానీ కాలం మారి పరిస్థితులు తలక్రిందులైనప్పుడు వేరేవారు అవే పనులు చేస్తే మాత్రం అందరూ దాన్ని సాధారణంగా తీసుకున్నారని అనుపమ పేర్కొన్నారు. -ఒకప్పుడు మిమ్మల్ని ఎందుకైతే తప్పుబట్టి దోషిగా నిలబెట్టారో? పరిస్థితులు మారిన తర్వాత అవే విషయాలు పూర్తిగా సాధారణమైపోతాయి- అంటూ అసంతృప్తిని వ్యక్తం చేసారు. చిన్న చిన్న విషయాల్లో ఆనందం పంచుకోవడం, ఇష్టమైన వారిని ప్రశంసించడం వంటి సాధారణ చర్యలను కూడా కొందరు అనవసర విమర్శలకు గురిచేస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా అనుపమ చేసిన వ్యాఖ్యలు ఇంటర్నెట్‌లో హైలైట్‌గా నిలిచాయి. -ఇది అసలు మీరు ఏం చేశారనేది కాదు. ఆ పని చేయడానికి అసలు ఎవరికి అనుమతి ఉంది అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది- అంటూ రాసుకొచ్చిన వాక్యం నెట్టింట వైరల్ అవుతోంది. సెలబ్రిటీల జీవితాలను సోషల్ మీడియాలో చూసి మాత్రమే అంచనా వేసే వారికి ఈ వ్యాఖ్యలు కౌంటర్‌గా ఉన్నాయని అభిమానులు అభిప్రా యపడుతున్నారు.



వృషకర్మ ప్రమోషన్లలో
చైతూ, మీనాక్షి

ఒక సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాక, దాని గురించి ప్రేక్షకులకు చెప్పడానికి నెల రోజులే మిగిలితే మామూలు ప్రమోషన్లు సరిపోవు. బాక్సాఫీస్ వద్ద సినిమా క్లిక్ కావాలి అంటే ప్రమోషన్ గేమ్ లో తప్పకుండా క్లిక్కవ్వల్సిందే. ఇక నాగచైతన్య 'వృషకర్మ' టీమ్ ఇప్పుడు అదే పరిస్థితిలో ఉంది. ఇంతకాలం పోస్టర్లు, చిన్న అప్‌డేట్స్‌కే పరిమితమైన చిత్రబృందం ఒక్కసారిగా బయటకు వచ్చింది. లేటెస్ట్ గా చైతూ, మీనాక్షి చౌదరి కలిసి ప్రమోషన్లకు హాజరయ్యారు. ఇద్దరూ ట్రెడిషనల్ దుస్తుల్లో కెమెరాల ముందు కనిపించారు. కానీ ఈసారి వాళ్లు చేస్తున్న ప్రచారంలో ఓ ప్రత్యేకత కనిపిస్తోంది. సినిమా భారీగా తీశామని చెప్పే బదులు, షూటింగ్ జరిగిన ప్రదేశాన్నే మీడియాకు చూపిస్తున్నారు. ఇటీవల విలేకరులను 'వృషకర్మ' సెట్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ యాభై రోజులు కష్టపడి నిర్మించిన బ్రహ్మగిరి గుహను పరిచయం చేశారు.



బాలీవుడ్ దర్శకుడు సంజయ్ గుప్తా మృతి

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ గుప్తా (59) కన్నుమూశారు. అక్టోబర్ 30న రాత్రి బాత్‌రూమ్‌లో జారిపడటంతో ఆయన తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. దర్శకుడు అశోక్ పండిట్ కూడా సంజయ్ గుప్తా మరణవార్తను ధ్రువీకరించారు. ఇంట్లో తలకు గాయమవడంతో ఆయన మృతి చెందారని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. సంజయ్ గుప్తా మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని సంతాపం తెలిపారు. 1994లో ఆదిత్య పంచోలీ, సంజయ్ దత్ ప్రధాన పాత్రల్లో నటించిన 'ఆతిష్: ఫీల్ ద ఫైర్' సినిమాతో సంజయ్ గుప్తా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 'రామ్ శాస్త్ర', 'ఖౌఫ్', 'జంగ్' చిత్రాలకు దర్శకత్వం వహించడంతో పాటు రచయితగా, నిర్మాతగానూ వ్యవహరించారు.

మానసికంగా కుంగిపోయా

ప్రేమ, నమ్మకద్రోహం అండ్ మానసిక వేదన గురించి తాజా ఇంటర్వ్యూలో హీరోయిన్ రెజీనా కసాండ్రా చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. ఆమె నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మూకుత్తి అమ్మన్-2'. నయనతార అమ్మవారుగా, సుందర్ సి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రిలీజ్‌కు ఉండగా.. వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటి రెజీనాకసాండ్రా.. తన వ్యక్తిగత జీవితం, బాధాకరమైన బంధం, తన అనుభవాల గురించి బహిరంగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా తన గత ప్రేమబంధం 2020లో ముగిసిందని రెజీనా వెల్లడించారు. ఆ సమయంలో తాను తీవ్రమైన నమ్మకద్రోహానికి గురయ్యానని, అది తనను మానసికంగా పూర్తిగా కుంగదీసిందని ఆమె పేర్కొన్నారు. ఆ బాధ నుంచి కోలుకునే క్రమంలో తాను ఎంతో తీవ్రమైన మానసిక సంఘర్షణ ఎదుర్కొన్నట్లు వివరించింది.





సన్నీ సూపర్ మామ్ స్టంట్



గ్లామర్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి సన్నీ లియోన్ తెరపై ఎంత బోల్డ్‌గా గ్లామరస్‌గా కనిపిస్తారో? నిజ జీవితంలో మాత్రం అంకితభావం గల మంచి తల్లి. పిల్లల పట్ల సన్ని చూపించే ప్రేమ, వారి సంతోషం కోసం చేసే ప్రయత్నాలు ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తుంటాయి. తాజాగా హలోవీన్ పండుగను పురస్కరించుకుని సన్నీ లియోన్ నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేడుకలకు సంబంధించిన ఆసక్తికర విశేషాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాధారణంగా ప్రముఖులు పెద్ద పెద్ద క్లబ్‌లలో లేదా కాస్ట్లీ హోటళ్లలో పార్టీలు చేసుకోవడానికి ఇష్టపడతారు. కానీ సన్నీ లియోన్ మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఆలోచించారు. తాజా ఇంటర్వ్యూలో సన్నీ లియోన్ మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ పిల్లలతో కలిసి ఇంటివద్దే పండుగలను జరుపుకోవడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ ఏడాది హలోవీన్ సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేకంగా ఒక స్కేర్‌ఫెస్ట్ పార్టీని హోస్ట్ చేసినట్లు వెల్లడించారు. పిల్లలని భయపెట్టే దెయ్యాల వేషాలు.. భయానక వాతావరణం.. విచిత్రమైన మాస్క్‌లు ..ప్రత్యేకమైన డెకరేషన్‌తో ఇల్లును ఒక హంటెడ్ హౌస్‌లా మార్చేసినట్లు సంతోషంగా పంచుకున్నారు.

సారా అలీఖాన్.. మన మిడిల్ క్లాస్

బాలీవుడ్ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న సెలబ్రిటీల జీవితాలు ఎంతో విలాసవంతంగా ఉంటాయని అంతా భావిస్తుంటారు. అయితే యువ నటి సారా అలీఖాన్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తుంటారు. స్టార్ కుటుంబం నుంచి వచ్చినా ముంబై నగరంలో టెంపుల్స్, దర్గాల చుట్టూ తిరుగుతూ ఎంతో సింపుల్‌గా జీవించడం అమ్మడి ప్రత్యేకత. సారా స్నేహితులు సైతం ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాల నుంచే ఉండటం గమనార్హం. సారా అలీఖాన్ వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే .. తల్లిదండ్రులు విడిపోయినా తండ్రి నుంచి పూర్తి మద్దతు దక్కుతోంది. అయినా చిన్నప్పటి నుంచి మిడిల్ క్లాస్ వాతావరణంలో పెరగడంతో సారా ఆలోచనలు ఎంతో ప్రాక్టికల్‌గా ఉంటాయి. పెద్ద సెలబ్రిటీ అయినా ఆమె ప్రవర్తనలో ఎలాంటి గర్వం కనిపించదు. లగ్జరీ లైఫ్‌స్టైల్‌ను గుడ్డిగా అనుసరించకుండా వాస్తవిక దృక్పథంతో జీవితాన్ని కొనసాగిస్తుంటారు. ఆర్థిక వ్యవహారాల్లో సారా అలీఖాన్ పద్ధతిగా.. స్పష్టమైన ప్రణాళికతో అడుగులు వేస్తుంటారు. విలాసవంతమైన ఖర్చుల విషయంలో పరిమితులు పాటిస్తారు.



మళ్లీ విఫలమైన జైస్వాల్

న్యూజిలాండ్ 'ఎ'తో రెండో టెస్ట్

తొలిరోజు ఇండియా 'ఎ' కష్టాలు

న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత 'ఎ' జట్టుకు కష్టాలు కొనసాగుతున్నాయి. న్యూజిలాండ్ 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో తొలి రోజైన శనివారం, భారత 'ఎ' బ్యాటింగ్ లైనప్ తడబడింది. ముఖ్యంగా, టీమిండియా టెస్ట్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ పేలవ ఫామ్ కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ మైదానంలో ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో, కివీస్ బౌలర్ ఫ్రేజర్ షీట్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే జైస్వాల్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఈ పర్యటనలో అతను వరుసగా విఫలమవుతున్నాడు. తొలి అనధికారిక టెస్టులో 17, 5 పరుగులు మాత్రమే చేసిన జైస్వాల్, ఈ మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు. ఆ తర్వాత సాయి సుదర్శన్, యశ్ రాథోడ్, స్మరన్ రవిచంద్రన్ కూడా స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. దీంతో తొలి గంటలోనే భారత్ నాలుగు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కివీస్ బౌలర్ ఫ్రేజర్ షీట్ మూడు వికెట్లతో భారత టాపార్డర్‌ను దెబ్బతీశాడు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేవదత్ పడిక్కల్ ఒంటరి పోరాటం చేశాడు. నిలకడగా ఆడుతూ 80 పరుగులు సాధించాడు. అయితే, సెంచరీకి చేరువవుతున్న సమయంలో బంతిని వికెట్ల మీదకు ఆడుకుని (చాప్ట్ ఆన్) నిరాశగా వెనుదిరిగాడు. పడిక్కల్ అవుటైన తర్వాత, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ జోడీ జాగ్రత్తగా ఆడి, 87 బంతుల్లో 23 పరుగులు జోడించి వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు సన్నాహకంగా ఈ అనధికారిక టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కీలక ఓపెనర్ అయిన జైస్వాల్ ఫామ్ కోల్పోవడం భారత జట్టు యాజమాన్యానికి కొత్త తలనొప్పిగా మారింది.

రబాడా.. స్టెయిన్ రికార్డు బ్రేక్



దక్షిణాఫ్రికా స్టార్ ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. బంతుల పరంగా అత్యంత వేగంగా 350 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియాతో కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టు ఐదో రోజు ఆటలో ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో 288 పరుగుల లక్ష్య ఛేదనకు ఆస్ట్రేలియా బరిలో దిగగా, ఈ ఇన్నింగ్స్‌లోనే రబాడ ఈ ఘనత సాధించాడు. ఆసీస్ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడం ద్వారా తన 350వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఫీట్ సాధించడానికి రబాడకు కేవలం 13,808 బంతులు మాత్రమే అవసరమయ్యాయి.



జడేజా కథ ముగిసినట్టే?

భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా వన్డే భవిష్యత్తుపై మాజీ క్రికెటర్లు చతేశ్వర్ పుజారా, అభిషేక్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వన్డే సిరీస్‌లకు జడేజాను ఎంపిక చేయకపోవడంతో వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? అనే చర్చ మొదలైంది. న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌కు 37 ఏళ్ల జడేజాను ఎంపిక చేయలేదు. ఎడమచేతి వాటం స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు జట్టు యాజమాన్యం తొలి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో వన్డేల్లో జడేజా ప్రయాణం ముగిసినట్లేనని పుజారా అభిప్రాయపడ్డాడు. జడేజాను వన్డేల్లో కొనసాగించాలని భావిస్తే న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపిక చేసేవారని అన్నాడు. అక్షర్‌కు ఎక్కువ అవకాశాలు ఇస్తున్నందున జడేజాకు ఈ విషయాన్ని ముందుగానే చెప్పి ఉండొచ్చని పేర్కొన్నాడు. జడేజా వయసును దృష్టిలో ఉంచుకుని టెస్టు క్రికెట్‌పైనే దృష్టి పెట్టాలని జట్టు యాజమాన్యం సూచించి ఉండొచ్చని పుజారా తెలిపాడు. ఇప్పటికే టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడికి వన్డేల్లోనూ అవకాశాలు తగ్గే సూచనలు ఉన్నాయని జియోస్టార్ కార్యక్రమంలో వ్యాఖ్యానించాడు. మరోవైపు అభిషేక్ నాయర్ మాత్రం జడేజాకు ప్రపంచకప్ జట్టులో అవకాశం ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అక్షర్ పటేల్ గాయపడితే అతడి స్థానంలో జడేజానే ముందుగా గుర్తుకొస్తాడని చెప్పాడు. అక్షర్ తర్వాత జడేజా భారత జట్టుకు 'ఇన్సూరెన్స్ పాలసీ'లా ఉంటాడని పేర్కొన్నాడు. ప్రపంచకప్‌కు ముందు అక్షర్‌కు ఏదైనా జరిగితే జడేజాను జట్టులోకి తీసుకునే అవకాశముందని నాయర్ అన్నాడు. నవంబర్ 4 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న ప్రపంచకప్‌కు ముందు జట్టు కూర్పును పరీక్షించుకునేందుకు ఈ సిరీస్ కీలకం కానుంది.



ICC WORLD TEST CHAMPIONSHIP

POINTS TABLE | 2025-2027 AS ON 31.10.2026

POS	TEAM	PCT(%)	PTS	MATCHES W	L	D	QED
1	NZ	72.22	52	4	1	1	0
2	SA	71.43	60	5	2	0	0
3	AUS	69.23	108	9	4	0	0
4	IND	51.52	68	5	4	2	0
5	BAN	47.62	40	3	3	1	0
6	ENG	38.54	74	7	8	1	14
7	SL	33.33	24	1	2	3	0
8	WI	26.92	42	3	8	2	2
9	PAK	4.63	5	2	7	0	8



డబ్ల్యూటీసీ.. భారత్ నం.4

డబ్ల్యూటీసీ పట్టికలో భారీ మార్పులు.. అగ్రస్థానానికి న్యూజిలాండ్

కేప్‌టౌన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మూడో టెస్టులో సౌతాఫ్రికా 176 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ఫలితం ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 పాయింట్ల పట్టికలో పెను మార్పులకు కారణమైంది. ఈ విజయంతో సౌతాఫ్రికా రెండో స్థానానికి ఎగబాకగా, అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా మూడో స్థానానికి పడిపోయింది. దీంతో న్యూజిలాండ్ పట్టికలో అగ్రస్థానానికి చేరింది. ఈ మ్యాచ్‌లో 288 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 111 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ సైమన్ హార్మర్ ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, పేసర్ కగిసో రబాడ మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో సౌతాఫ్రికా 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకోవడమే కాకుండా, టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. తాజా మార్పుల ప్రకారం, డబ్ల్యూటీసీ పట్టికలో న్యూజిలాండ్ 72.22 పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (పీసీటీ)తో అగ్రస్థానంలో నిలిచింది. 71.43 పీసీటీతో సౌతాఫ్రికా రెండో స్థానానికి చేరుకోగా, ఓటమితో ఆస్ట్రేలియా 69.23 పీసీటీతో మూడో స్థానానికి పరిమితమైంది. మరోవైపు, వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో బంగ్లాదేశ్ ఓడిపోవడం భారత్‌కు అనుకూలించింది. ఈ మ్యాచ్‌కు ముందు 55.56 పీసీటీతో నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్, ఓటమితో 47.62 పీసీటీకి పడిపోయింది. దీంతో 51.52 పీసీటీతో ఐదో స్థానంలో ఉన్న టీమిండియా, బంగ్లాను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకుంది. ఈ తాజా ఫలితాలతో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు వచ్చే ఏడాది ఓవల్ మైదానంలో జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

ఐదో టీ20లో భారత్ భారీ మార్పులు?

నేడు హామిల్టన్‌లో తుది పోరు

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను విజయంతో ముగించడమే లక్ష్యంగా టీమిండియా చివరి పోరుకు సిద్ధమవుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 3-1తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ.. ఆక్లాండ్‌లో ఎదురైన 87 పరుగుల భారీ ఓటమి భారత జట్టును ఆలోచనలో పడేసింది. దీంతో ఆదివారం హామిల్టన్‌లో జరిగే ఐదో టీ20లో తుది జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది.



ముఖ్యంగా యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పిస్తారా? సంజూ శాంసన్‌ను పక్కన పెడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. సిరీస్ తొలి మ్యాచ్‌లో 67 పరుగులు చేసిన సంజూ.. ఆ తర్వాత వరుసగా 14, 18, 4 పరుగులకే పరిమితమయ్యాడు. దీంతో అతడి స్థానంలో వైభవ్‌ను ఆడించే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా నిలకడగా రాణించలేకపోతున్నాడు. వెస్టిండీస్‌తో లక్నోలో తొలి టీ20 సెంచరీ సాధించిన తర్వాత గత ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో 40, 1, 16, 22, 42, 7, 5, 22 పరుగులు మాత్రమే చేశాడు. చివరి మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాలని అతడు భావిస్తున్నాడు. నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌తో ఉపయోగపడుతున్నా.. బంతితో మాత్రం ఇంకా ప్రభావం చూపలేదు. మరోవైపు పరిస్థితులను బట్టి కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలను తుది జట్టులోకి తీసుకునే అవకాశముందని స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే సంకేతాలిచ్చాడు. అయితే, వీరిలో ఒకరిని తీసుకోవాలంటే నమన్ ధీర్‌ను తప్పించాల్సి రావచ్చు. అలా చేస్తే బ్యాటింగ్ డెప్త్ తగ్గడంతో పాటు పార్ట్‌టైమ్ ఆఫ్‌స్పిన్ సేవలూ దూరమవుతాయి. మరోవైపు గ్లెన్ ఫిలిప్స్ ఫామ్‌పై న్యూజిలాండ్ భారీ ఆశలు పెట్టుకుంది. ఆక్లాండ్‌లో అద్భుత సెంచరీ చేసిన అతడు.. నాలుగు మ్యాచ్‌ల్లో 276 పరుగులు చేశాడు. ఐదు మ్యాచ్‌ల ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో మార్క్ చాప్‌మన్ (290) తర్వాతి స్థానంలో ఉన్నాడు. ఆక్లాండ్‌లో అర్ధశతకం బాదిన మైకేల్ బ్రేస్‌వెల్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇరు జట్ల స్పిన్నర్ల మధ్య పోటీ కూడా కీలకం కానుంది. న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ ఈ సిరీస్‌లో నిలకడగా బౌలింగ్ చేస్తున్నాడు. శాంట్నర్ 55 శాతం బంతులను ఫుల్‌గా వేయగా, అక్షర్ 72 శాతం బంతులను షార్ట్‌గా సంధించాడు. హామిల్టన్ మైదానం కూడా చిన్నదే కావడంతో ఎడమచేతి వాటం స్పిన్నర్ల వ్యూహాలు మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపనున్నాయి. నవంబర్ 1న మధ్యాహ్నం 12.30 గంటలకు హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. టీవీలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది. సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లోనూ లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది.



ఆసీస్‌కు సౌతాఫ్రికా షాక్

టెస్ట్ సిరీస్ గెలిచిన ప్రొటీస్

స్పిన్నర్ సైమన్ హార్మర్, పేసర్ కగిసో రబాడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చడంతో, చివరి టెస్టులో దక్షిణాఫ్రికా 176 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సఫారీ జట్టు మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకోవడమే కాకుండా, ఐసీసీ టెస్ట్ టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి తిరిగి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో 288 పరుగుల సవాలుతో కూడిన లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా, చివరి రోజు పేలవ ప్రదర్శనతో కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది. నాలుగో రోజు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడంతో ఆసీస్ గట్టి పోటీ ఇస్తుందని భావించినా, దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి తలవంచింది. ఆఖరి రోజు ఆట ప్రారంభంలోనే కగిసో రబాడ తన ప్రతాపం చూపించాడు. కేవలం 14 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బతీశాడు. మాథ్యూ రెన్షా (0), మార్నస్ లబుషేన్ (2), ట్రావిస్ హెడ్ (16)లను పెవిలియన్‌కు పంపి సఫారీలను విజయానికి చేరువ చేశాడు. ఈ క్రమంలోనే రబాడ టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన జోష్ ఇంగ్లిస్ (4) రనౌట్ కావడం ఆసీస్‌ను మరింత కష్టాల్లోకి నెట్టింది. ఆ తర్వాత స్పిన్నర్ సైమన్ హార్మర్ రంగంలోకి దిగి ఆసీస్ పతనాన్ని పూర్తి చేశాడు. అలెక్స్ క్యారీ (6), బ్యూ వెబ్‌స్టర్ (0)లను స్వల్ప వ్యవధిలో ఔట్ చేశాడు. కామెరాన్ గ్రీన్ (27), నాథన్ లియాన్ కాసేపు పోరాడినా, హార్మర్ వారి ప్రతిఘటనకు తెరదించాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ (10), జోష్ హేజిల్‌వుడ్ (0)లను కూడా ఔట్ చేసి, 21.1 ఓవర్లలో కేవలం 16 పరుగులిచ్చి 6 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతకుముందు, దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత పునరాగమనం చేసింది. ర్యాన్ రికెల్టన్ (101), వియాన్ ముల్డర్ (115) సెంచరీలతో చెలరేగారు. ఆరో వికెట్‌కు 154 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు 387 పరుగుల భారీ స్కోరు అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 329 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 429 పరుగులతో 100 పరుగుల ఆధిక్యం సాధించింది. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించడంతో దక్షిణాఫ్రికా చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. డర్బన్‌లో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ గెలవగా, గెబెర్హాలో జరిగిన రెండో టెస్టులో సఫారీలు గెలిచి సిరీస్‌ను సమం చేసిన విషయం తెలిసిందే.



వైభవ్‌ను స్వేచ్ఛగా ఆడనివ్వండి

శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య భారత యువ క్రికెటర్లపై ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యంగా, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్ భవిష్యత్తుకు ఒక మంచి పెట్టుబడి అని ఆయన అభివర్ణించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని, అయితే అతని దూకుడైన బ్యాటింగ్ ఇప్పటికే ప్రత్యేకంగా నిలుస్తోందని జయసూర్య అన్నారు. "అతడిని తన సహజమైన ఆటను ఆడనివ్వండి. అతడి పని అతడిని చేయనివ్వండి. అలా చేస్తే, భారత క్రికెట్‌కు అతను ఒక మంచి పెట్టుబడి అవుతాడు" అని ఆయన సూచించారు. యువ ఆటగాడిపై అనవసరమైన అంచనాలు, ఒత్తిడి పెట్టవద్దని టీమ్ మేనేజ్‌మెంట్‌కు సలహా ఇచ్చారు. మరో భారత ఆటగాడు అభిషేక్ శర్మను కూడా జయసూర్య ప్రశంసించారు. అభిషేక్‌ను ఒక ఆల్-రౌండ్ బ్యాటర్‌గా అభివర్ణిస్తూ, గ్రౌండ్‌లో నలువైపులా షాట్లు ఆడగల సామర్థ్యం అతనికి ఉందని కొనియాడారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో జరుగుతున్న ట్రై-సిరీస్‌లో శ్రీలంక జట్టు ప్రదర్శనపై జయసూర్య సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈవార్తలు
ప్రజావాణి
ఆదివారం 1-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు



తెలంగాణ ప్రజలు అడుగుతున్నరు..
రైతులకు తక్షణ ఉపశమనమేది?
రాబోయే వేసవికి ప్రణాళికేది?
పంట నష్ట పరిహారమిచ్చేదెప్పుడు?
రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పెంచేదెప్పుడు?

ఏపీ ప్రజలు అడుగుతున్నరు..
అమరావతి పూర్తయ్యేదెప్పుడు?
జల జగడాలు ఆగిపోయేదెప్పుడు?
రక్తపు రాజకీయాలు ఆగేదెప్పుడు?

దేశ ప్రజలు అడుగుతున్నరు..
ధరల భారం తగ్గేదెప్పుడు?
నిరుద్యోగం పోయేదెప్పుడు?
అన్నదాత కడుపు నిండేదెప్పుడు?
ఆహార భద్రత పెరిగేదెప్పుడు?

‘బొ’చ్చు’లో రాజకీయం!



కండ్లముందు కరువు చిత్రం..!
రైతన్న బతుకంతా ఛిద్రం..!
ప్రజా పాలనపై లేదు చిత్తం..!
వ్యక్తిగత విమర్శలన్నీ తుచ్ఛం..!
కేటీఆర్ బొచ్చుపై చర్చ..!
అన్నాచెల్లి ఇంటిపై రచ్చ..!!
ఇదేమి రాజకీయ రొచ్చు..!
వదలాలి పుర్రెలోని పుచ్చు..!!

సాగు నీళ్లు లేవు.. తాగే నీళ్లూ లేవు.
పంట పరిహారం లేదు.. పంట పండించే పరిస్థితి లేదు. ఖజానాలో పైసల్లేవు.. ఆదాయం పెంచే తరీఖ తెల్వదు. కానీ, ‘బొచ్చు’లో మాటలు.
పిచ్చి పిచ్చి కూతలు. అన్నాచెల్లి ఇంటిపై రచ్చ.. పనికిరానిది ప్రజలకు ఆ చర్చ.
తిట్లకే పాలకుల ప్రాధాన్యం..
ప్రజాస్వామ్యానికిది పరిహాసం.
ఇంకెన్నాళ్లీ రాజకీయ రోత.
ఊడ్చేయాలి ఈ చెత్త.

తెలంగాణలో కాంగ్రెస్ నాయకులకు ప్రతిపక్ష నేత కేటీఆర్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి మాట్లాడటం ముఖ్యమైందా? ఒక నాయకుడు తన రూపురేఖల కోసం ఏం చేసుకున్నడన్నది రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశమా? ఆయన పాలనలో చేసిన తప్పులుంటే ఆధారాలతో నిలదీయాలి. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటే ప్రశ్నించాలి. విధానాల్లో లోపాలుంటే ఎండగట్టాలి. కానీ జుట్టు గురించి మాట్లాడితే ప్రజలకు ఒరిగేది ఏంటి? రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో, ఎన్ని హామీలు నెరవేర్చారో, రైతులకు ఎంత పరిహారం అందించారో చెప్పడం కంటే ప్రత్యర్థి పెట్టుకున్న జుట్టుపై వ్యాఖ్యలు అవసరమా?

ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే దుస్థితి. జగన్ ఇల్లు, షర్మిల బిడ్డ పెళ్లి వంటి కుటుంబ, వ్యక్తిగత వ్యవహారాల చుట్టూ రాజకీయ విమర్శలు తిరుగుతున్నాయి. ఒకవైపు కరువు, మరోవైపు తుఫాను నష్టాలు. రైతుల పంటలు దెబ్బతిన్నాయి. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం, నిరుద్యోగం, పరిశ్రమలు, పెట్టుబడు లు, ప్రత్యేక హోదా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై సమగ్ర చర్చ జరగాల్సి ఉంది. కానీ ఒక కుటుంబంలోని ఆస్తుల వివాదాలు, ఇళ్ల వ్యవహారాలు, పెళ్లిళ్లు రాజకీయ వేదికలపై ప్రధాన చర్చలుగా మారుతున్నాయి. ఒకరి ఇంటి వ్యవహారం కంటే ఇల్లు లేని పేదల సమస్య ముఖ్యం కాదా? ఒకరి కుటుంబ వివాదం కంటే రైతు కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలు పెద్దవి కావా? నాయకుల వ్యక్తిగత వ్యవహారాలే ప్రజా సమస్యల స్థానాన్ని ఆక్రమిస్తే ప్రజాస్వామ్యానికి మిగిలే విలువ ఏమిటి?

దేశవ్యాప్తంగా కూడా ఇదే ధోరణి ఆందోళన కలిగిస్తోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, వ్యవసాయ సంక్షోభం, మహిళల భద్రత, విద్యా వైద్యం, పర్యావరణ కాలుష్యం, సైబర్ నేరాలు, సరిహద్దు భద్రత వంటి అంశాలపై రాజకీయ పార్టీలు నిరంతరం చర్చించాలి. పార్లమెంటు, శాసనసభలు ప్రజల సమస్యలకు పరిష్కారాలు వెతికే వేదికలుగా నిలవాలి. కానీ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, వ్యక్తిగత జీవితాలను రాజకీయాలకు వాడుకోవడం, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం పరిపాటిగా మారుతోంది. రాజకీయాల్లో విమర్శలు ఉండాలి. కానీ అవి విధానాలపై ఉండాలి. ఆరోపణలు ఉండాలి. కానీ వాటికి ఆధారాలు ఉండాలి. చర్చలు జరగాలి. కానీ అవి ప్రజల భవిష్యత్తును నిర్ణయించే అంశాలపై జరగాలి.



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్బీ
9581291919,
9441291919

తెలంగాణలో అనావృష్టి.. ఆంధ్రప్రదేశ్‌లో అతివృష్టి. ముఖ్యంగా, తెలంగాణలో కరువు పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు నీటిపాలయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో తాగునీటి భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వనరుల సంరక్షణ, రైతులకు పరిహారం, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ హామీల అమలు.. ఇలా రాష్ట్రం ముందు ఎన్నో సవాళ్లున్నాయి. వీటన్నింటికీ పరిష్కారాలు చూపాల్సిన పాలకులు, ప్రతిపక్షాలు మాత్రం పరస్పర విమర్శలకే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ వ్యవహారమే ఇందుకు నిదర్శనం. బరాజ్‌లో సమస్యలు బయటపడినప్పటి నుంచి రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తుత ప్రభుత్వం ఎత్తిచూపుతోంది. నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, ప్రజాధనం వృథా అయిందని విమర్శిస్తోంది. తప్పులు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందే. ప్రజాధనం దుర్వినియోగమైతే విచారణ జరిపించాల్సిందే. అందులో రెండో మాటకు తావులేదు. కానీ విచారణలతోపాటు మరమ్మతులు కూడా జరగాలి కదా! ప్రజాధనంతో నిర్మించిన భారీ ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండటాన్ని ఎంతకాలం చూస్తూ ఊరుకుంటారు? మేడిగడ్డను ఎలా పునరుద్ధరించాలి? ఎప్పుడు మరమ్మతులు చేపట్టాలి? ప్రజలకు ఉపయోగపడేలా ఎప్పుడు అందుబాటులోకి తీసుకురావాలి? అన్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) బరాజ్‌ని పరిశీలించి, దాని భద్రతకు సంబంధించిన పరీక్షలు, మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలపై సూచనలు చేసింది. ఆ సిఫారసులను నిపుణుల సాంకేతిక నివేదికలతో సమన్వయం చేసి, అవసరమైన చర్యలను వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఈ వ్యవహారం చుట్టూ రాజకీయ విమర్శలు, గత ప్రభుత్వంపై ఆరోపణలు, ప్రత్యర్థులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. విచారణ ఒకవైపు సాగాలి.. మరమ్మతులు మరోవైపు జరగాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవడం వేరు.. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రాజెక్టును పునరుద్ధరించడం వేరు. ఈ రెండింటినీ కలిపి రాజకీయ కక్షల కళ్లద్దాలతో చూడటం వల్ల నష్టపోయేది ప్రజలే. మేడిగడ్డలో కూలినది కేవలం బరాజ్ నిర్మాణంలోని కొంత భాగమే కాదు.. దానిపై ఆధారపడిన ప్రజల ఆశలు కూడా. వాటిని తిరిగి నిలబెట్టాల్సిన బాధ్యత పాలకులపై లేదా?

ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ప్రజల కోసం ఉండాలి. పాలకులు ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపాలి. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. తప్పులను ఎత్తిచూపాలి. ప్రజల పక్షాన నిలబడాలి. కానీ నేటి రాజకీయాలను చూస్తుంటే అసలు రాజకీయాలంటేనే అసహ్యం కలిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజల బతుకులు బుగ్గిపాలవుతున్నా పట్టించుకునేవారు లేరు. రైతులు కరువుతో కన్నీళ్లు పెడుతున్నా స్పందించేవారు లేరు. తాగునీటి కోసం జనం అల్లాడుతున్నా పట్టించుకునే తీరిక లేదు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నా భరోసా ఇచ్చే నాథుడే లేడు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయ నాయకుల నోళ్లు మురిసిపోతున్నాయి.. నీళ్లు లేక రైతన్నల గొంతులు ఎండిపోతున్నాయి.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.